


₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 15

ఆగస్టు 1-15, 2018



## స్వయంపాలన, సహజీవనం అర్థమైతే యువతే మార్పు తెస్తారు

## కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ అందించిన 'అందరికీ ఆరోగ్యం' జాతీయ విధానం నమూనా



మిత్రులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు ఆగస్టు 15

42 STUDENTS 10 GPA /10 JR.INTER

మీ లక్ష్యం CA అయితే... మీ గమ్యం ఎమరాల్డ్స్
2018 ఇంటర్ ఫలితాలలో
విజయభేరి మ్రోగించిన ఎమరాల్డ్స్ విద్యార్థులు

Emerald's

THE BEST CHOICE FOR C.A

All India 21st CA-IPCC - 2018

M.Sainath Reddy 977 MEC+CA
S.Aishwarya 973 MEC+CA
C.H.Devi Prasanna 973 MEC+CA
K.Lokesh 973 MEC+CA
S.Haseena Taj 956 MEC
G.M.Jagannadham 949 CEC
S.Jahnavi 944 CEC

First Time in AP Emerald's
Proudly Introducing...
Different Course
with a Distinct Outlook

MEC / CEC
Corporate Skills

Emerald's
Junior college
LIC Road, Balaji Colony,
TIRUPATI - 517501
Phone: 0877-2260067

CEC & MEC + CA / ACCA
CEC & MEC + Computers
9494911100, 9866190700

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఆగస్టు 1-15, 2018 సంపుటి - 9 సంచిక - 15

## లోపలి పేజీల్లో...


స్వయంపాలన, సహజీవనం అర్థమైతే................ 5

నెక్స్ట్ జెన్ - నెట్ జెన్....................................... 10

ఎన్నికల నేతలకన్నా... సామాజిక నాయకులు........ 12

ప్రకృతి - సంరక్షణ- యువత.............................. 15

నీతి ఆయోగ్‌కి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా 2016.......... 18

ఏపీ వైద్య, ఆరోగ్య రంగం ప్రక్షాళనకు జేపీ బృందం.... 21

జనారోగ్యం ధనార్పణం................................ 24

జనం నమ్మకంలో అట్టడుగున రాజకీయ పార్టీలు.... 26

ప్రత్యక్ష ఎన్నికే మందు !.................................. 27

ఉద్యోగాలనిచ్చే పరిశ్రమలకు పెద్దపీట వేయాలి.... 29

మళ్లీ మళ్లీ అర్జీలు.. ప్రజలంటే లెక్కలేని అధికారులు.. 31

కాలేజీకి రోడ్డు వేయండి బాబూ !...................... 32

పార్కుల కబ్జాపై లోక్‌సత్తా ఆగ్రహం.................... 33

మన విద్యార్థులు అమెరికా వాళ్లకంటే మెరికలు........ 34





ఇచ్చినతను కూడా
ఎక్కడా చెప్పడు! ఇంకా హ్యాపీ!!




లంచం ఇవ్వకపోయావో ఇస్తానన్నావని చెబుతా జాగ్రత్త!

# కార్టూన్ కార్నర్


## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి.కుటుంబరావు


## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# ముక్కుమూసుకుని ఓట్లేస్తున్నారు

గాంధీ కళ్లద్దాల్ని, సెలబ్రిటీల గ్లామర్‌ని కలగలిపి 'స్వచ్ఛభారత్' పేరుతో పారిశుద్ధ్యం పనిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దినా.. ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు నిధుల్ని కూడా అడగటం లేదని ఆమధ్య ప్రధాని నరేంద్ర మోదీ వాపోయినట్టు వార్తలచ్చాయి. ప్రజలకు ఉపయోగపడే ఓ మంచి కార్యక్రమాన్ని చేయాలనే సదుద్దేశమున్నా.. స్వచ్ఛభారత్‌ను పూర్తిస్థాయిలో నెరవేర్చాలనే దృఢ సంకల్పాన్ని మోదీ ప్రదర్శించలేకపోయారు. అందుకే ఆ కార్యక్రమంలోని విధానపరమైన లోపాల్ని సరిదిద్దలేకపోయారు. స్వచ్ఛభారత్ సెస్సు పేరుతో జనం నుంచి వేలకోట్ల డబ్బును పిండుతున్నా.. ప్రచారం, పైపై పనులు మాత్రమే జరుగుతున్నాయి. దాదాపు 30 ఏళ్ల తర్వాత అసాధారణమైన ప్రజాదరణతో ఎన్నికైన ప్రధానమంత్రే అయినా.. ఆ అరకొర సత్సంకల్పమే ఆయన్ను 'స్వచ్ఛరాజకీయం' కార్యక్రమంలో కూడా విఫలుడ్ని చేస్తోంది. పైగా చీపురుతో రోడ్లూడ్చినంత తేలిక కాదు, రాజకీయాలను ప్రక్షాళన చేయటం! 'పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయలేని మీరు దేశ ప్రజాస్వామ్యాన్ని ఏం కాపాడతారు?' అని కాంగ్రెస్‌నుద్దేశించి మోదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చేసిన వ్యాఖ్య ఈవేళ వారి పార్టీక్కూడా వర్తిస్తుంది. వంశపారంపర్య రాజకీయాలు వంటి అంశాల్లో కాస్త తేడాల్ని మినహాయిస్తే పార్టీలోపల అధికార కేంద్రీకరణ, అప్రజాస్వామిక ధోరణుల్లో కాంగ్రెస్, బీజేపీ, పలు ప్రాంతీయ పార్టీల మధ్య పెద్ద తేడా ఏమీ లేకుండా పోయింది. ఎన్నికల్లో నిజాయతీపరులు, సమర్థులు ఎన్నికయ్యే అవకాశాల్ని ఏ పార్టీ మెరుగుపరచలేకపోయింది. 'ప్రజలు మాకు ఓట్లేసి గెలిపిస్తున్నారు, మేం ప్రజానాయకులం, ప్రజాప్రతినిధులం, వీరులం, శూరులం, మీరు మాకు చెప్పేదేంటి ' అని ఆ పార్టీల నేతలు దబాయించవచ్చు. కానీ చట్టవిరుద్ధంగా డబ్బు ఖర్చు పెట్టకుండా, ప్రజల పేదరికాన్ని, అవిద్యను ఆసరాగా చేసుకుని వారిని ప్రలోభపెట్టకుండా, బలహీనతల్ని రెచ్చగొట్టకుండా వీరికొచ్చే ఓట్లు ఎన్నుంటాయి? ఇంత చేసి అధికారంలోకొచ్చినా లేదా సీట్లు గెలిచినా వీరి పట్ల ప్రజలకు గౌరవం, విశ్వాసం ఉందా? జనం ముక్కుమూసుకుని గతిలేదన్నట్టు ఓట్లేస్తున్నారు, కృత్రిమ ఆదరణను కనబరుస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం (ఏపీయూ), అభివృద్ధి చెందుతున్న సమాజాలపై అధ్యయన కేంద్రం (సీఎస్‌డీఎస్) లోక్‌నీతి ఉమ్మడి అధ్యయనం కూడా ధ్రువీకరించింది. ఈ సర్వే శాంపిల్ పరిమితమైనదే అయినా, తోసిపుచ్చలేనిది. నిజానికి ఇది మన పక్కనే ఉన్న టైంబాంబ్‌పై హెచ్చరిక! ఎందుకంటే, రాజకీయాలు నాశనమైతే సర్వరంగాలూ నాశనమవుతాయి. అందుకే 'రాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం మనిషి జీవితంలో మరోటి ఉండదు' అని లోక్‌సత్తా తొలి నుంచీ పేటెంట్ కోట్‌లా చెబుతోంది. రాజకీయాల పట్ల జుగుప్సతో ఎన్నికల్ని, పాలనను కొంతమంది నాయకులకు, వారి కుటుంబాలకు గుత్తగా అప్పజెప్పేసి ప్రజలు మౌనప్రేక్షకుల్లా మారిపోయిన తరుణంలో రాజకీయ, పాలనా సంస్కరణలకు లోక్‌సత్తా నడుం బిగించింది. నెమ్మదిగానైనా లక్షలమంది స్పందించారు. రాజకీయమంటే దగా, అందులో చేరితే చెప్పుతో కొట్టండి.. అన్న సామాజిక కార్యకర్తలు కూడా ఆ తర్వాత లోక్‌సత్తా బాటలో రాజకీయాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే, జనజీవితాల్లో మార్పు తెస్తామన్న ఆశ కలిగించిన కొందరు నాయకులకు, పార్టీలకు ప్రజలు కొంత స్వచ్ఛందంగా పట్టం గడుతూ వచ్చారు. మోదీ గెలుపు, రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో పాలకుల విజయమూ అలాంటివే. కానీ జనం జీవితాలతో సంబంధం లేని పాత పాలననే వాళ్లు పునరావృతం చేశారని తాజా సర్వే రుజువు చేస్తోంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొనటంలో రాజకీయ పార్టీలది అట్టడుగు స్థానమని ఈ సర్వే చెబుతోంది. రాజకీయ పార్టీలపై ఏపీలో విశ్వాసం -24 కాగా, తెలంగాణలో -21గా ఉంది. ప్రజలు రాజకీయాల్ని ద్వేషించటానికి, ప్రస్తుత పాలకుల కంటే సైనిక నియంతలే మేలనుకోవడానికి ప్రధాన కారణాలు- వారి మౌలికావసరాలు తీరకపోవడం, పెద్ద త్యాగాలు లేకుండా రోజువారీ పనులు చూసుకుంటూ దుష్పరిపాలనను మార్చే అవకాశాలు వారికి అందుబాటులో లేకపోవడం! ఎన్నికల మధ్య రాజకీయాల్ని మార్చే అవకాశం తమ చేతిలో ఉంటే, ప్రజలు రాజకీయాల ప్రాధాన్యతను, పవిత్రతను గుర్తిస్తారు. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను జవాబుదారీతనంలో బలోపేతం చేయటం ఇందుకు చక్కటి పరిష్కార మార్గం! దీనివల్ల ప్రజల్లో రాజకీయాలు, పాలన గురించి అవగాహన పెరిగి పౌరసత్వంతో స్పందిస్తూ నాయకులుగా ఎదగగలుగుతారు. తాము కట్టే పన్నుల డబ్బును సద్వినియోగం చేసే అవినీతిరహిత పాలన, విద్య, వైద్యం, ఉపాధి, చట్టబద్ధపాలన వంటి విధానాల కోసం ఓటు, ఇతర మార్గాల్లో పోరాడగలుగుతారు. ఈ ఏర్పాటు చేస్తూనే.. ప్రజాప్రతినిధులుగా సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికయ్యేందుకు వీలుగా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలి. మహిళా, బీసీ రిజర్వేషన్లు వంటి వాటి కోసం చట్టాలు చేయటం కంటే ముందు పార్టీల్లోనే జనాభా ప్రకారం సీట్లివ్వాలి. సమర్థులు వేగంగా పార్టీలో ఉన్నతస్థానాలకు ఎదిగే అవకాశం కల్పించాలి. ఓటు వృథా కాకుండా దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని తేవాలి. ఇదేసమయంలో, రాజకీయాలంటే కేవలం ఎన్నికల్లో పోటీ, గెలుపు అనే భ్రమల నుంచి కూడా మనం బైటపడాలి. సామాజిక రాజకీయాల ప్రాధాన్యతను గుర్తించాలి. ఎన్నికల రాజకీయాల్లో పాల్గన్నా, లేకున్నా.. ప్రజలు ఎక్కడికక్కడ సామాజిక రాజకీయాల్లో భాగం కావాలి. సోషల్ మీడియా, ఇతర సాంకేతిక పరిజ్ఞానాల్ని ఉపయోగించుకుంటూ ముఖ్యంగా యువత సామాజిక నాయకులుగా తయారవ్వాలి. 'విధిగా సామాజిక రాజకీయం, ఓపికుంటే ఎన్నికల రాజకీయం'- అనే నమూనాలో సమాజాన్ని నిర్మించగలిగితే కచ్చితంగా రాజకీయాల పట్ల, పార్టీల పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. జనం జీవితాల్లో మేలిమి మార్పులు వేగంగా చోటుచేసుకోవటం మొదలవుతుంది. విద్వేషాలు, బూతులు తిట్టుకోవడాలు, మోసాల మధ్య నలిగిపోతున్న మనకు.. ఇటీవల థాయ్‌లాండ్ గుహలో నుంచి బాలల్ని రక్షించిన ఘటన ఎంతో స్వాంతననిచ్చింది. ఉన్నవాడికో న్యాయం లేనివాడికి ఇంకో న్యాయం, లంచాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రచార ఆర్భాటం తరహా రాజకీయమే అక్కడా జరిగి ఉంటే వారిని రక్షించటం సాధ్యమయ్యేదా? అసాధ్యం సుసాధ్యమయ్యేదా? అలాంటి మెరుగైన పరిస్థితుల్ని మన వద్ద ఎందుకు నిర్మించుకోలేకపోతున్నాం?.. అనే ఆలోచనల్ని కూడా ఆ ఉదంతం మనలో కలిగించాలి. 'రాజకీయం' అనే పదానికి విలువ పడిపోయింది కాబట్టి దాని బదులు ఇంకో పేరు వాడాలని లోక్‌సత్తా పార్టీని ప్రారంభిస్తున్నప్పుడు కొంతమంది సూచించారు. మన చేతిలో ఉన్న పరిష్కారాల్ని ఉపయోగించి మార్చే శక్తి ప్రజల్లో, నాయకుల్లో లేనప్పుడు.. ఏ పదం పెట్టినా ఫలితంలో పెద్ద తేడా ఉండదు. రాజకీయాలను దాటవేయటం కాకుండా.. మార్చటం పార్టీలు, నేతలు, యువత లక్ష్యంగా మారితేనే మార్పు సాధ్యం. చెడ్డ ప్రజాస్వామిక రాజకీయానికి విరుగుడు మరింత మంచి ప్రజాస్వామిక రాజకీయమే తప్ప సైనిక పాలన కాదు.





# స్వయంపాలన, సహజీవనం అర్థమైతే యువతే మార్పు తెస్తారు : జేపీ

**జ**నాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మన యువతకు స్వయంపాలన, సహజీవనం గురించి అవగాహన పెరిగితే ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుందని, సరైన మార్పు చోటుచేసుకుంటుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఇందులో ఒకటి పాలనకు సంబంధించినదికాగా, రెండోది సమాజానికి సంబంధించినదన్నారు.

స్వయంపాలనకు స్థానిక ప్రభుత్వాలే పాఠశాలలన్నారు.

సహజీవన సంస్కృతిని పెంచటానికి మతపెద్దలు, పౌరసమాజం, మీడియా కూడా కలిసిరావాలన్నారు.

అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, విద్య–ఉపాధి, స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేకుండా సేవలు, చట్టబద్ధ పాలన, రైతుకు, కౌలురైతుకు న్యాయమైన ఆదాయం, కులనిర్మూలన, ఫిరాయింపులకు ఆస్కారం లేకుండా ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక మొదలైన అంశాలపై లోక్‌సత్తా క్రమం తప్పని లోతైన కృషి చేస్తోందని జేపీ అన్నారు.

"రాజకీయం లక్ష్యం ప్రజల ఎదుగుదలే అయితే.. నిజమైన రాజకీయాన్ని నిరంతరం పూర్తిస్థాయిలో చేస్తున్నది లోక్‌సత్తా మాత్రమే" అని జేపీ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాజకీయ పరిస్థితులు, కుల రాజకీయాలు, రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు, యువత ఏం చేయాలి తదితర అంశాలపై ఓ పత్రికకు జేపీ ఇచ్చిన ఈ–మెయిల్ ఇంటర్వ్యూ– లోక్‌సత్తా 22వ ఆవిర్భావ దినోత్సవం (ఆగస్టు 3) సందర్భంగా..

**(?) తెలుగునాట కుల, ఫిరాయింపు రాజకీయాలు లాంటివి కొనసాగడం వల్ల భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థకు పెనుముప్పు వాటిల్లే పరిస్థితుల్ని ఎలా ఎదుర్కోవాలి**

డా॥ జేపీ: నిజాయతీ, అవగాహన, కులాలకతీతంగా వ్యవహరించగల సమర్థతలను బట్టి కాకుండా.. కేవలం కులాలను బట్టి నాయకులను అంచనా వేయటం, ఎన్నికైన వాళ్లు అమ్ముడుపోయో, వ్యక్తిగత అవసరాల కోసమో పార్టీ ఫిరాయించి అధికార పార్టీలో చేరిపోవటం కచ్చితంగా ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న మన ప్రజాస్వామ్యానికి ఇది మరీ ప్రమాదకరం. నన్ను చాలామంది అడుగుతున్నారు– తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఫిరాయింపుల గురించి గట్టిగా గొంతు విప్పమని! ఓటుకు నోటు, ఓటుకు కోట్లు రాజకీయాల గురించి, ఫిరాయింపుల గురించి పలుమార్లు చెప్పాను.

లోక్‌సత్తా కృషి వల్లే వచ్చిన 91వ రాజ్యాంగ సవరణ వల్ల కొంతమేర ఫిరాయింపులకు అడ్డుపడినా అది సరిపోవటం లేదు. తెలంగాణలో తెలుగుదేశం సభ్యుల్ని టీఆర్ఎస్ లాక్కుంటే, ఆంధ్రప్రదేశ్‌లో అదే తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష వైకాపా సభ్యుల్ని లాక్కుంది. ఇంత దిగజారాక మాటలతోనో, విమర్శలతోనో, చిన్నచిన్న మార్పులతోనో ప్రక్షాళన సాధ్యం కాదు. ఇందుకు వ్యవస్థీకృత సంస్కరణలు కావాల్సిందే.

అందులో భాగంగానే.. ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకోవటం, దామాషా ఎన్నికల పద్ధతి, స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో కూడిన అధికారాలు, నిధులు ఇవ్వటం చేపట్టటం తదితర సంస్కరణల్ని తీసుకురావాలని లోక్‌సత్తా ప్రతిపాదించింది.

కుల రాజకీయాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా ఎంత నిర్ద్వంద్వంగా గళం విప్పిందో చాలామందికి తెలుసు. వీటిని ఇంకా బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లటానికి వీలైనంత మేర ప్రయత్నిస్తూనే ఉన్నాం.

**(?) ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి అని చాలా సందర్భాల్లో అనుకుంటూ ఉంటాం, అది ఏ విధంగా సాధ్యం?**

ప్రజల ఆలోచనల్లో మార్పు అంటే పరిణతి పెరగటం, మెరుగ్గా ఆలోచించగలగటం. అది జరగాలంటే, స్వయంపాలన, సహజీవనం ఈ రెంటి గురించీ ప్రజలకు తెలియాలి. ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో ఉన్న యువతకు తెలియాలి. వాటిని వారు రోజువారీ జీవితంలో భాగం చేసుకోగలగాలి. స్వయంపాలన అంటే పాలనకు సంబంధించినది, సహజీవనం అనేది సమాజానికి సంబంధించినది.

ప్రజలు స్వయంపాలనను అర్థం చేసుకునేలా చేసే ప్రజాస్వామ్య పాఠశాలలు స్థానిక ప్రభుత్వాలు! ఈ మూడో అంచె ఫెడరల్ వ్యవస్థ సక్రమంగా ఉంటే, ప్రజలకు పాలన అంటే ఏమిటో చక్కగా అర్థమవుతుంది. మనకు తెలియకుండానే మన ఆలోచనలు ఢిల్లీ చుట్టూ, రాష్ట్రాల రాజధానుల చుట్టూ తిరుగుతుండటం వల్ల అసలు పాలన అంటే ఏమిటో, పాలనకు–మన పన్నుల డబ్బుకు–మన బతుకులకు ఉండే సంబంధమేమిటో తెలియకుండానే ఎన్నికలు జరిగిపోతున్నాయి. స్వతంత్ర పోరాటకాలంలో బ్రిటీషువాళ్ల మీద పోరాటం చేయటమనే ఒకే ఒక్క అంశంతో తెలిగ్గా జాతి మొత్తం ఏకమైంది. కానీ స్వయంపాలన అంటే అలా ఏదో ఒక బూచిని చూపి, ఏదోక ఆవేశంతో ఎవరోకరిని నిందిస్తుంటే సాధ్యం కాదు. దీన్ని మార్చాలంటే స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చి ప్రజలను ఎక్కడికక్కడ భాగస్వాముల్ని చేయటమే మార్గం. అందుకే యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) కార్యాచరణలో భాగంగా స్థానికంగా నాయకులుగా ఎదగమని, స్థానిక ఎన్నికల్లో సరైన ఎజెండాతో పోరాడి గెలిచి స్వయంపాలన అందించాలని యువతకు చెబుతున్నాను.

ఇక రెండోది సహజీవనం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా కలిసి జీవించటం మనకు తొలి నుంచి ఏదోకరకంగా సమస్యే! కింద కులాల పట్ల వివక్ష ఉండగా, సమానంగా ఉన్న కులాలను కూడా సహించే ధోరణి మనకు లేదు. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగవుతూ ప్రపంచజ్ఞానం పెరుగుతున్నకొద్దీ సహజీవనంలో సమస్యలు సంక్లిష్టమవుతున్నాయి. కలిసి సామరస్యంతో బతకగలిగే సమాజ నిర్మాణానికి మనం పెద్దఎత్తున ప్రయత్నం చేయాలి, కొనసాగిస్తుండాలి. ఇది కేవలం రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వం చేస్తే జరిగే పని కాదు. పౌర సమాజం, మత పెద్దలు, మీడియా ప్రధాన బాధ్యతలు తీసుకోవాలి.

ఈ స్వయంపాలన, సహజీవనం లేకుండా మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామనుకోవటం భ్రమే అవుతుంది.

**(?) సాధారణ ప్రజల్లో మార్పు దాదాపుగా వారి ఆర్థిక స్థితిగతులపై జీవన ప్రమాణాలపై ఆధారపడి వుంటుంది. వాటిని సాధించడానికి ఏవైనా సలహాసూచనలు**

మార్పు వస్తే జీవనప్రమాణాలు మెరుగవుతాయి, జీవనప్రమాణాలు పెరిగితే మార్పు వస్తుంది.. ఇది విత్తు ముందా? చెట్టు ముందా? అన్నట్టుంది.

ఏ దేశంలోనూ ఇలా ఏదో ఒకటి ముందు జరిగి తర్వాత రెండోది రాలేదు. రెండూ ఏకకాలంలో జరగాలి. ఇందుకోసం బహుముఖంగా వ్యవస్థలో మార్పులు తెచ్చుకోవాల్సిందే. అడ్డదారులేవీ లేవు.

ఎలాంటి మార్పులు తెచ్చుకోవాలో ప్రజలను నిరంతరం చైతన్యపరచగలం. రాజకీయవేత్తగా, ఉద్యమకారునిగా, పౌరునిగా నిరంతరం ఆ పని చేస్తున్నాను.

దేశం గురించి ఆలోచించలేకపోయినా, తమ జీవితాల్ని బాగుచేసుకోవటానికి ఏం కావాలో యువత తెలుసుకోవాలి. ఏ స్థాయి యువతీయువకులకైనా, ఇతర ప్రజానీకానికైనా తమ పరిధిలో అది సాధ్యమైన పనే.

అలా తమ జీవితాలకు జరిగే ఉపయోగాలను తెలుసుకుని యువత స్పందించటం మొదలుపెడితే మార్పు దానంతట అదే వస్తుంది.

**(?) మీలాంటి భావాలు కలిగిన యువతకు వారికి ఉన్నటువంటి కనీస శక్తియుక్తులతో ఈ వ్యవస్థపై ఉద్యమించడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది**

యువత మొత్తం ఏకమై గంపగుత్తగా వ్యవస్థ మీద ఉద్యమించటమనేది 99శాతం సాధ్యమయ్యే పనికాదు. జాతీయోద్యమకాలంలో అలాంటిది కొంతమేర జరిగింది. ఈ పోటీ ఆధునిక ఆర్థిక ప్రజాస్వామిక యుగంలో ఆదాయాల్ని వదులుకుని యువత సమయమంతటినీ దేశం కోసం వెచ్చించటమంటే అది ఆచరణ సాధ్యం కాదు. ఇప్పుడు కావలసింది స్థానికంగా ఎక్కడికక్కడ పాలనలో, సమస్యల పరిష్కారంలో భాగమయ్యే యువత!

ఇందులో భాగంగా.. విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు వంటి కొన్ని కీలకరంగాలను యువత పట్టించుకుంటుండాలి. ఒక అంశంపై సరైన రీతిలో స్పందించేందుకు కావలసిన సరైన ప్రాతిపదికల్ని పెంపొందించుకోవాలి.

ఇంకా ఉత్సాహం అవకాశం ఉంటే అప్పుడు రాష్ట్ర, జాతీయస్థాయిలోకి రావొచ్చు. కీలక రంగాలు, స్థానిక పాలన ఇవి రెంటినీ యువత గట్టిగా పట్టించుకోగలిగితే కచ్చితంగా వాళ్లు సరైన దిశలో చరిత్ర నిర్మాణం చేయగలరు.

**?) ప్రజల వైపు నుంచి కాకుండా చట్టాలలో మార్పుల వల్ల ఈ పరిస్థితులను గాడిలో పెట్టే అవకాశాలు ఏమైనా ఉన్నాయా**

సరైన చట్టాలు అవసరం. కానీ పటిష్టమైన స్థానిక ప్రభుత్వాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సరైన చట్టబద్ధపాలన ఉంటే ప్రజలు చట్టాలను సమర్థవంతంగా ఉపయోగించుకోగలుగుతారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు యాంత్రికంగా ఉంటే చట్టాలు కూడా మొక్కుబడిగా మారిపోతాయి.

**(?) విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పులు చేపట్టవలసి ఉంటుంది**

మంచి విద్యావ్యవస్థకు మనదేశంలో ఎంతో డిమాండ్ ఉంది. కానీ ఒక కుట్ర పన్నినట్టుగా నాణ్యమైన విద్యను అందించటం లేదు. ఈ మాటలు చాలా బాధతో అంటున్నాను. సరైన విద్య అందకుండా పేదరికం నుంచి బైటపడ్డ దేశం ప్రపంచంలోనే లేదు. అలాంటిది జనంలో డిమాండ్ ఉన్నా మన ప్రభుత్వాలు ఎందుకు అందించలేకపోతున్నాయి? మనదేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యాసంస్థలు అందరూ సక్సెస్‌ను కోరుకుంటున్నారు. అప్పులు చేసి రాత్రింబవళ్లూ చదివించి మరీ ర్యాంకులు తెచ్చుకోవాలని పోటీపడుతున్నారు. ర్యాంకులు, సర్టిఫికెట్లయితే వస్తున్నాయిగానీ సరైన చదువు మాత్రం రావటం లేదు. భారీ డిమాండ్ ఉంది కాబట్టి కొద్దిపాటి శ్రద్ధ, సంకల్పం చూపితే మనం విద్యావ్యవస్థను సమూలంగా మార్చుకోవచ్చు. ముఖ్యంగా సక్సెస్‌కిచ్చే నిర్వచనాన్ని మార్చాలి. విద్యార్థులలోని ప్రతిభ, సామర్థ్యాలను, విశ్లేషణ, తర్కం, సృజనాత్మకతలను భారం మోపకుండా వెలికితీసేలా మూల్యాంకన పద్ధతుల్ని అమలుచేయాలి. నాణ్యమైన విద్యను రాజకీయానికి, పాలనకు, సమాజానికి కేంద్రబిందువు చేసేందుకు తొలి నుంచీ కృషి చేస్తున్న లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న విద్యాసంస్కరణలపై మరిన్ని వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఈ విషయాల్ని కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వానికి, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకూ కూడా అందించాం. దేశ భవిష్యత్తును కొత్త పుంతలు తొక్కించగల ఈ మౌలిక సంస్కరణలు వారికి ఇంకా ప్రాధాన్యత కలిగినవిగా అనిపించటం లేదు.

**(?) వైద్యరంగంలో ఎలాంటి మార్పులు చేపట్టవలసి ఉంటుంది**

వైద్యరంగాన్ని బాగుచేయాలంటే దేశంలో ఉన్న నిధులు సరిపోవని ప్రభుత్వంలో, రాజకీయ పార్టీల్లో ఉన్నవారితో సహా చాలామంది భావిస్తున్నారు. ఈ అపోహకు ప్రజారోగ్యం పట్ల విపరీత నిర్లక్ష్యం తోడవటంతో సామాన్య ప్రజలకు ఆరోగ్యం అందకుండా పోతోంది. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా, బిల్లులు జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కాస్త పెద్ద జబ్బు వస్తే పేద, మధ్యతరగతికి అప్పులు తప్ప మార్గం లేదు. కేవలం అనారోగ్యం వల్ల దేశంలో 6 కోట్లమందిదాకా ఏటా పేదరికంలో కూరుకుపోతున్నారు. కానీ సంకల్పం ఉండాలేగానీ, భారత్‌కున్న కొన్ని రకాల అవకాశాల నేపథ్యంలో తక్కువ ఖర్చుతోనే అందరికీ ఆరోగ్యాన్ని అందించవచ్చని లోక్‌సత్తా సమగ్ర అధ్యయనంలో తేలింది.

మన ప్రభుత్వాసుపత్రులకు ఇస్తున్న నిధుల్ని, అవి అందిస్తున్న సేవలని చూస్తే ఉన్నదాంట్లో అక్కడి వైద్యసేవలు అద్భుతమనే చెప్పుకోవాలి. సగటున 1000 పడకలున్న సర్కారీ దవాఖానాల్లో 2000 పడకలకు సేవలందిస్తున్నారు. ఎందుకంటే రోజూ వేలసంఖ్యలో రోగులన్నున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రోజూ సగటున 3,000-4,000 మంది చొప్పున పేషెంట్లు వస్తుంటే, ఢిల్లీ ఎయిమ్స్‌లో 10,000 దాటిపోతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కో పడకకు జీతభత్యాలు సహా అన్నీ కలుపుకుని ఏడాదికి 8లక్షలు ఖర్చు చేస్తుంటే, ప్రయివేటు ఆసుపత్రుల్లో 1 కోటి రూపాయలు వరకు ఖర్చవుతోంది. కాబట్టి పెద్దాసుపత్రుల్ని నిందించటం పరిష్కారం కాదు. మనకున్న సమస్య ప్రధానంగా అట్టడుగు స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఉంది. గ్రామాల్లో ఉన్నవారికి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే డాక్టర్ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. అట్టడుగుస్థాయి నుంచి, మనకున్న పరిమిత వనరుల్లో సరైన పరిష్కారాన్ని వెతకాలి. మూడు పరిష్కారాలను లోక్‌సత్తా సూచిస్తోంది: 1) ప్రతి పౌరునికీ ఒక డాక్టర్ అందుబాటులో ఉండాలి. కొంతమంది వైద్యుల బృందంలో ఏ డాక్టర్‌ను ఎంచుకోవాలో కూడా స్వేచ్ఛ ఆ పౌరునికి ఉండాలి. దీని వల్ల గ్రామాల్లో సహా ప్రతి ఇంటికీ ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటారు.

2) తాలూకా, మండల స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, చిన్న చిన్న నర్సింగ్ హోంలు కలిసి ప్రజారోగ్య సేవలు అందిస్తాయి. ఎమర్జెన్సీ కేసుల్లో మినహా ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు చేసిన రోగులకు మాత్రమే వీరు వైద్య సేవలు అందిస్తారు.

3) దిగువ రెండు స్థాయిల్లో చికిత్స సాధ్యం కాని రోగులకు వైద్యసేవలందించేందుకు జిల్లా, బోధనాసుపత్రులుంటాయి. ఇక్కడ ప్రస్తుతం పెడుతున్న ఖర్చును కనీసం 3రెట్లు పెంచాలి. ఈ పెద్దాసుపత్రుల్లో కూడా ఎమర్జెన్సీ మినహా మిగతా కేసుల్లో కిందిస్థాయి ఆసుపత్రులు సిఫార్సు చేస్తేనే రోగులకు వైద్యసేవలు అందిస్తారు.

ఈ మౌలిక మార్పులతో ప్రజలు జేబులో నుంచి రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆరోగ్య నమూనాను లోక్‌సత్తా రూపొందించి కేంద్రప్రభుత్వానికి అందించింది. ఇప్పుడు వైద్య, ఆరోగ్య రంగాలపై కేంద్రం చేస్తున్న ఖర్చు స్థూల జాతీయాదాయంలో 1.21 శాతంకాగా, లోక్‌సత్తా నమూనాలో ఆ ఖర్చు మరో శాతం లోపే పెరుగుతుంది. అంటే 2శాతం పరిధిలోనే అందరికీ అందుబాటులో వైద్యం అందించవచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత తక్కువ ఖర్చుతో ప్రజలకు ఆరోగ్యం అందించిన దాఖలాలు లేవు.

ఎట్టకేలకు ఆరోగ్య రంగ ప్రాధాన్యతను గుర్తించి 'ఆయుష్మాన్ భారత్' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ పెద్ద అడుగు వేస్తున్నా.. ఆ విధానం రూపకల్పన లోపభూయిష్టంగా ఉంది. ఖజానా నుంచి డబ్బులు ఖర్చవుతాయి, తాత్కాలికంగా ప్రభుత్వానికి ప్రచారం లభిస్తుంది తప్ప ప్రజలకు మాత్రం ఆరోగ్యం అందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఆయుష్మాన్ భారత్‌లోని లోపాల్ని సరిచేసేందుకు, ఏకాభిప్రాయాన్ని కూడగట్టేందుకు లోక్‌సత్తా వీలైనంత ప్రయత్నం చేస్తోంది. లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానంపై మరిన్ని వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

**(?) మెడిసిన్ మరియు ఇంజినీరింగ్ లాంటి విద్యలు నిరుపేద విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉన్నాయి. ఈ పరిస్థితులు దేశాభివృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపుతాయి**

ప్రైవేటు విద్యాసంస్థలకు ఒక్కసారిగా పెద్దఎత్తున అనుమతులివ్వటం, వాటి అనుమతుల్లో విపరీత అవినీతి, ఆ సంస్థల నిర్వహణ కోసం అవుతున్న ఖర్చును బేరీజువేసి ఆ

ఖర్చుని రాబట్టుకోవటానికి తీసుకుంటున్న ఫీజుల్ని గానీ పారదర్శకంగా నిర్ణయించకుండా నల్లడబ్బుకు సీట్లు అమ్ముకోవడం– ఇవీ ప్రైవేటు వృత్తివిద్యాసంస్థల్లో సమస్యలు. వీటన్నిటినీ పరిష్కరించాలంటే.. విద్యాసంస్థల నిర్వహణకోసం ఎంత ఖర్చవుతుందో అంచనావేసి, మంచి ప్రమాణాలు ఉండేలా నియంత్రించి ఫీజుల్ని నిర్ణయించాలి. బీద, అణగారిన వర్గాల విద్యార్థులకు ఫీజుల భారం లేకుండా ప్రభుత్వం వివిధ రాయితీల్ని ఇవ్వాలి. ఇదొక్కటే ఆచరణాత్మక పరిష్కారం.

**(?) అవినీతి నిర్మూలన గురించి సామాన్యుడికి ఏం చెప్తారు**

అవినీతి పోవాలంటే వీలున్నంత వరకు పోటీని ఏర్పరచాలి. గుత్తాధిపత్యాన్ని తొలగించాలి.

ఉదాహరణకు, టెలిఫోన్ల రంగంలో పోటీ రాగానే అందరికీ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు ఫోన్ రావాలంటే పెద్ద రికమండేషన్లు, లంచాలు, నెలలు, సంవత్సరాల తరబడి ఎదురుచూడటాలు ఉండేవి.

అలాగే 2జీ స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపులో లోక్‌సత్తా చేసిన న్యాయపోరాటం వల్ల స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం పాటలు జరిగి దేశానికి లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. అలా ఆ రంగాలలో అవినీతి గణనీయంగా తగ్గింది.

అదేరీతిలో సామాన్యులు అవినీతి బారిన పడకూడదంటే, 1) అన్ని స్థాయిల్లో కంప్యూటరీకరించి ఈ–సేవ, మీ సేవ వంటి విధానాలను పారదర్శకంగా అమలుచేయాలి 2) ప్రభుత్వ కార్యాలయాల్లో చేసే ప్రతి పనికీ గడువు పెట్టి, ఆ గడువులోగా ప్రజలకు పనిచేసిపెట్టకపోతే దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించేలా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని (ఎలక్ట్రానిక్ సేవలతో కలిపి) అమలు చేయటం అవసరం. మనలో అమాయకత్వం, అజ్ఞానం కొనసాగుతూ ఉంటే అవినీతిపరులు అంతకంతకూ మనల్ని దోచేస్తూనే ఉంటారు.

ఇవి కాకుండా రాజకీయ, ఎన్నికల సంస్కరణలు కావాలి.

అవినీతి నిర్మూలనకు కావలసిన లోక్‌సత్తా ప్రతిపాదించిన రాజకీయ, ఎన్నికల సంస్కరణలను, వాటి కోసం కృషిని www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

**(?) మీరు ప్రధానంగా ఏఏ అంశాల మీద పనిచేస్తున్నారు, మీ భవిష్యత్తు రాజకీయ ఉద్యమ కార్యాచరణ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవచ్చా**

జేపీ: రాజకీయం లక్ష్యం ప్రజల ఎదుగుదలే అయితే.. నిజమైన రాజకీయాన్ని నిరంతరం పూర్తిస్థాయిలో చేస్తున్నది లోక్‌సత్తా మాత్రమే.

ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు, దేశం ఉన్న పరిస్థితుల్లో మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా సేవలందించే సర్వీస్ గ్యారంటీ చట్టం, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, రైతులకు, కౌలురైతులకు ఆదాయం, గ్రామన్యాయాలయాలు, ఇతర పోలీసు, న్యాయ సంస్కరణలతో చట్టబద్ధ పాలన, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, కులనిర్మూలన అంశాల మీద ప్రజల్లో అవగాహన పెంచి లక్ష్యాల ప్రాతిపదికన ప్రజలను సంఘటింతం చేసి ఉద్యమాన్ని నిర్మించటానికి లోక్‌సత్తా కృషి చేస్తోంది. సురాజ్య యాత్ర ఇందులో భాగమే. రాబోయే కాలంలో 90 శాతం యువతదే. ఇప్పుడు మనం చేస్తున్న ప్రయత్నం వల్ల ఇప్పటి తరం వారికన్నా.. రాబోయే యువతరానికే ఎక్కువ మేలు జరుగుతుంది.

అందుకే యువతకు సమస్యలపై, పరిష్కారాలపై లోతైన అవగాహన పెంచి, వారి కెరీర్‌కు నష్టం లేకుండా స్థానిక నాయకులుగా పరిష్కారంలో భాగస్వాముల్ని చేసేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నాం. యువత సోషల్ ఇంజినీరింగ్ లీడర్లుగా వ్యవహరించేందుకు వీలుగా వారికి సమగ్ర శిక్షణను అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మొత్తంలో సోషల్ మీడియా, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని అవకాశంగా వినియోగించుకుంటున్నాం.

సాంకేతికతను ఉపయోగించుకుంటూ అవగాహనతో యువత సంఘటితంగా ఎక్కడికక్కడ పోరాడగలిగితే రాబోయే సంవత్సరాల్లో ఈ దేశ దశ, దిశను మార్చగలుగుతారు. ఇది తప్ప వేరే పరిష్కారం కూడా లేదు. యువతకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకే వైబీఐ ప్లాట్‌ఫాంను నిర్మించాం. 'యూత్‌ఫర్‌బెటర్‌ఇండియాడాట్‌కామ్'లో ఎన్‌రోల్ అయి, తమ చదువుల్ని, కెరీర్ని, జీవితాల్ని చూసుకుంటూనే యువత తమ సుఖసంతోషాల కోసం మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు. అలాగే నలభై దాటిన పౌరులు కూడా తమ వంతు సేవల్ని అందించేందుకు 'సిటిజన్స్ ఫర్‌బెటర్‌ఇండియాడాట్‌కామ్'లో నమోదవ్వచ్చు. ఇలాంటి పౌరుల సలహాసూచనలు, ఇతరత్రా మద్దతు వైబీఐకి కూడా ఎంతో ఉపయోగపడతాయి.

# నెక్ట్స్ జెన్ - నెట్ జెన్

ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవటం వల్ల భారత్‌లోని రాబోయే తరాల్లో సామాజిక రుగ్మతలు కొంతమేర తగ్గే అవకాశముందని ఓ సర్వే తెలిపింది.

కొత్త సహస్రాబ్దిలో జన్మించిన వారి ఆలోచనా సరళిపై 'ఇన్‌షార్ట్స్' అనే వార్తల యాప్ 'జాతి నాడి' పేరుతో ఈ సర్వేను నిర్వహించింది. 18-35 ఏళ్ల వయసున్న 1.30 లక్షల మంది అభిప్రాయాలను సేకరించి విశ్లేషించి నివేదికను తయారుచేశారు. యువతరంలో కొన్ని కోణాల్లో స్పష్టమైన మార్పు కనిపించిందని తేలింది.

ఇండియన్ యూత్ చేతిలో పనిముట్టుగా మారిన ఇంటర్నెట్ వారిలో ఆధునిక భావజాలాన్ని పెంపొందిస్తోందని జాతి నాడి తెలిపింది. "దీని ప్రభావం వల్ల కులాల పట్టింపులు వంటి పాత భావాలను నవతరం పక్కన పెడుతోంది. కులాంతర వివాహాలకు మొగ్గు పెరుగుతోంది. ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా యువత ఉదారవాదాన్ని, విశాల దృక్పథాన్ని అలవరచుకుంటోంది. వెబ్‌సైట్ల సాయంతో తమ జీవిత భాగస్వాముల్ని స్వయంగా అన్వేషించుకోవటం పెరుగుతోంది. జీవిత భాగస్వామి ఎంపికలో కులం, మతం, ఆదాయానికి ప్రాధాన్యం ఇవ్వకుండా.. వ్యక్తిత్వం, వ్యవహారశైలిని పరిగణలోకి తీసుకుంటోంది. భారతీయ సమాజంపై ఇది ప్రభావం చూపుతోంది" అని పేర్కొంది.

### స్మార్ట్‌ఫోన్లతో సోషల్ మీడియా ప్రభంజనం

ఇంటర్నెట్ విస్తృతంగా అందుబాటులోకి రావడంతోపాటు చౌకగా ప్యాకేజీలు లభిస్తుండటంతో సోషల్ మీడియాను ఉపయోగించేవారి సంఖ్య ఊహించనివిధంగా పెరుగుతోంది. 2021 నాటికి కేవలం చైనా, భారత్ నుంచే 110 కోట్ల మంది వినియోగదారులు ఉండనున్నారు. సోషల్ మీడియా పలు రూపాల్లో అందుబాటులోకి వస్తున్నది. ఇందులో బ్లాగ్స్, ఫోరమ్స్, బిజినెస్ నెట్‌వర్క్స్, సోషల్ గేమింగ్, మైక్రోబ్లాగ్స్ తదితర సామాజిక మాధ్యమ నెట్‌వర్క్‌లున్నాయి.


సామాజిక మాధ్యమాలు తమ విస్తృతిని పెంచుకోవడానికి స్మార్ట్‌ఫోన్లను వేదికగా చేసుకుంటున్నాయి. మొబైల్ ఇంటర్నెట్‌తోపాటు స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్ అప్లికేషన్లు స్థిరంగా తమ ఉనికిని చాటుతుండగా, వాటిలో కొన్ని మొబైల్ వేదికల్లోనే పనిచేస్తున్నాయి. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి అప్లికేషన్లు ఈ కోవలోకే వస్తాయి. దీనికి అదనంగా 'ఫోర్ స్క్వేర్' వంటి అప్లికేషన్లు ప్రొఫైల్ బేస్డ్ సేవలను అందిస్తున్నాయి. 'తంబ్లర్', 'పింటరెస్ట్' వంటి అప్లికేషన్లు విజువల్ బ్లాగింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 246 కోట్ల మంది సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. 2022 నాటికి భారత్ నుంచి 35 కోట్ల మంది సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలంగా ఉంటారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా సగటు వినియోగదారుడు ఒక్క రోజులో 135 నిమిషాలపాటు ఈ మాధ్యమాల్లో గడుపుతున్నారు. 2016 నాలుగో త్రైమాసికంలో వంద కోట్ల మంది వినియోగదారులు కేవలం మొబైల్ ద్వారా ఫేస్‌బుక్‌ను వినియోగించారు.

స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. 2021 నాటికి ప్రపంచ జనాభాలో 40 శాతం మంది స్మార్ట్‌ఫోన్‌ను కలిగి ఉంటారని నిపుణులంటున్నారు. సామాజిక మాధ్యమాలకు బానిస కాకుండా అవసరాలకు ఉపయోగించుకోవటం, వాటిల్లో చేసే చర్చల్లో ప్రమాణాల్ని పెంచటం వంటి ధోరణులు పెరిగితే.. సోషల్ మీడియా వెల్లువ మానవజాతి చరిత్రలోనే ఓ పెద్ద సానుకూల విప్లవానికి దోహదం చేస్తుందనటంలో సందేహం లేదు. నిజానికి భారతదేశంలో పెనుమార్పులు తేవాలనే సాహసోపేత లక్ష్యంతో 22 ఏళ్ల క్రితం లోక్‌సత్తా ఆవిర్భవించటానికి కూడా.. యువత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలనే అద్భుత వనరులు అందుబాటులో ఉండటమే ప్రధాన కారణం!

తాము సంతోషంగా గడుపుతున్నామని కులాంతర వివాహాలు చేసుకున్న 70 శాతం మంది తెలిపారు. పెళ్లి తరువాత మహిళలు వారి ఇంటి పేరు మార్చుకోవాల్సిన అవసరం లేదని 70 శాతం మంది అబ్బాయిలు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడు కొనసాగుతున్న ఆచారానికి విరుద్ధంగా పెళ్లి ఖర్చుల భారాన్ని పంచుకోవడానికి 90 శాతం మంది యువకులు సిద్ధపడుతున్నారు.

భార్యాభర్తల మధ్య స్పర్థలు రావడానికి ఒక కారణంగా ఉన్న ఆదాయం విషయంలో కూడా యువత గతం కంటే మెరుగ్గా ఆలోచిస్తోంది. భార్య సంపాదన అధికంగా ఉంటే తమకు ఇబ్బందికరంగా ఉంటుందని కేవలం ఏడు శాతం మంది మాత్రమే అభిప్రాయపడ్డారు. అమ్మాయిల విషయానికొస్తే, భర్తల సంపాదన తమకన్నా తక్కువగా ఉన్నా సమస్యేమీ లేదని 84 శాతం మంది చెప్పారు.



ఈ మార్పునకు రెండు కారణాలున్నాయని డేటింగ్ యాప్ 'ట్రూలీ మ్యాడ్లీ' సహ వ్యవస్థాపకుడు హితేష్ ధింగ్రా అభిప్రాయపడ్డారు. ఒకటి.. ఇంటర్నెట్, సోషల్ మీడియాలను ఉపయోగిస్తున్న యువత సాంప్రదాయక విలువలను సవాలు చేసే ఆధునిక ఉదార భావజాలం గురించి తెలుసుకుంటున్నారు. రెండోది.. డేటింగ్ యాప్స్, వెబ్‌సైట్ల ద్వారా తమ భాగస్వాములను ఎంచుకుంటున్నారు. 'తల్లిదండ్రులయితే కులాలు, ఆచారాలకు ప్రాధాన్యమిచ్చే అవకాశాలు ఎక్కువ. అదే యువతయితే, తమకు నచ్చినవారిని ఎంచుకుంటున్నారు. దీంతో ఎంపిక తీరే మారిపోతోంది' అని వివరించారు.

ఇన్‌షార్ట్స్ సంస్థ సీఈవో అజహర్ ఇక్బాల్ మాట్లాడుతూ, కులం, పితృస్వామ్యం, మహిళలకు తక్కువ స్థానం కల్పించడం వంటి పాత పద్ధతులను వదిలించుకుంటున్న నవతరం వస్తోందన్నారు. 'ఇంటర్నెట్, అభివృద్ధి చెందిన దేశాల వ్యవహారశైలితో ప్రభావితమైన కొత్తతరం నిర్మాతలను మనం చూస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ☆

# రైతులకు పాలకులు క్షమాపణ చెప్పాలి





విజయనగరం జిల్లాలో వరి విత్తనాల కోసం రైతులు అధికారులు, పీఏసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ పడిగాపులు కాయటం సిగ్గుచేటని బాబ్జీ అన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే వారు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారన్నారు. విత్తనాల పెత్తనంపై కలెక్టర్‌కి ఆయన సాక్ష్యాలతో ఫిర్యాదు చేశారు. వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని ఆర్ అండ్ బీ రైతుబజారును కూల్చవద్దని కలెక్టర్ చెప్పినా, అధికారులు ఎలా కూల్చివేశారని బాబ్జీ ప్రశ్నించారు. రైతుల సామాన్లు, కూరగాయలు పోయాయని, వాటికి ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, అధికారుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం.. రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గాంధీ విగ్రహం వద్ద బాబ్జీ నిరసన వ్యక్తం చేశారు. రైతులకు పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, రాజారావు, శ్రీను, మిడతాన అప్పారావు, మూర్తి, సూర్య, ఎర్నిబాబు, రైతులు పాల్గొన్నారు. ☆



# ఎన్నికల నేతలకన్నా.. సామాజిక నాయకులు కావాలిప్పుడు!

- పద్మనాభం అప్పా

మన దేశ రాజకీయరంగంలో ప్రస్తుతం ప్రజాభిప్రాయ ప్రతినిధులు, వారిచే ఎన్నుకోబడి పరిపాలించే ప్రతినిధుల ప్రతినిధులే ఉన్నారు. కానీ ప్రజలకు మార్గ నిర్దేశనం చేసి (ప్రజాభిప్రాయాన్ని మలిచే) నాయకులు కరువయ్యారు. ఉన్న అతికొద్దిమందిలో ఒకరిద్దరు మినహా అందరూ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునే వ్యూహ చట్రాలలో చిక్కుకున్నారు. వీరు ఆత్మబోధనా దిశలో కాకుండా తాత్కాలిక లాభం కోసం పనిచేస్తున్నారు. సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు సమకూరకుండా తక్షణ (అసంబద్ధమైన, అనైతికమైన, పలు సందర్భాల్లో అమానుషమైన) ఉపశమనం మాత్రమే దక్కుతోంది. జాతీయ నాయకులు ఉదాత్తులైనా, గల్లీ లీడర్లు వారి సంకుచిత లాభాల కోసం ఇచ్చే సమాచారాన్ని ప్రజాహిత ఫీడ్‌బ్యాక్‌గా పరిగణిస్తున్నారు.

భారతదేశంలోని రాష్ట్ర, కేంద్ర రాజకీయాలను, ప్రభుత్వాలని చూస్తే ఈ కింది విషయాలు ప్రధానంగా కనిపిస్తాయి:

1) దీర్ఘకాలిక సమాజ ప్రయోజనాలను విస్మరించి (కొన్నిసార్లు ఫణంగా పెట్టి) మరుక్షణంలోనే మంచి జరుగుతుందనే భ్రమ కలిగించే చర్యలకు పెద్దపీట వేస్తున్నారు. తక్షణావసరాలను దీర్ఘకాలిక ప్రయోజనాలతో సంధానం చేసే కృషిని చేసే కష్టానికి సిద్ధపడకుండా.. ఏదోకరూపంలో ఉద్రేకపూరిత ప్రచారం, ఇన్‌స్టెంట్ ఉపయోగాల మంత్రాలతో నాయకులు ప్రాచుర్యం పొందుతున్నారు. ఎన్నికల్లో గెలుపే రాజకీయాల్లో విజయమన్న భ్రమలో బతుకుతున్నారు, అదే భ్రమను జనంలోనూ వ్యాపింపచేస్తున్నారు. దీనివల్ల సమాజంలోని సామాన్య, మధ్యతరగతి తీవ్రంగా నష్టపోతున్నారు. సంపన్నులకు కూడా క్రమంగా సెగ తగులుతోంది. ఉదాహరణలు..

మనదేశంలో అనాదిగా ఉన్న అసమానతల్ని, పేదరికాన్ని తొలగించగలిగినది నాణ్యమైన విద్య, అందులో భాగంగా లభించే సాంకేతిక ప్రమాణాలు అని తెలిసినా.. కొన్ని వర్గాలను ఆకట్టుకోవటం కోసం విద్యాప్రమాణాలని తగ్గించి సూచికలను మెరుగ్గా చూపటం, పాస్ మార్కులు తగ్గించటం, మాస్ కాపీయింగ్‌ని సహించటం (పరోక్షంగా ప్రోత్సహించటం) చేస్తున్నారు. పేద ప్రజలు ఆధారపడే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ అవకారాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఉద్యోగుల జీతాలు, సౌకర్యాలు ప్రైవేటు పాఠశాలల్లో కంటే ఎన్నో రెట్లు ఎక్కువయినా, వచ్చే అతితక్కువ పాస్ పర్సంటేజీ కూడా మాల్‌ప్రాక్టీస్ వల్ల వస్తోందన్నది పలు సందర్భాల్లో రుజువవుతోంది. ఫలితంగా, ప్రభుత్వం విద్యపై పెట్టే ఖర్చు విద్యాప్రమాణాలను పెంచడానికి బదులు దిగజార్చడానికి ఉపయోగపడుతోంది. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత మొదటి

రెండు దశాబ్దాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు, ఉపాధ్యాయుల నిబద్ధతలతో పోలిస్తే ఈరోజున మనం చూస్తున్నది శూన్యమే. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సహా అనేకమంది సుప్రసిద్ధులు ప్రభుత్వ బడులలో చదివే సామాన్య కుటుంబాల నుంచి ఉన్నత స్థాయికి ఎదగగలిగారు.




ఇక, అందరికీ ఆరోగ్యాన్ని అందించాల్సిన వైద్యరంగం ఇంతకంటే దిగజారింది. పనికిమాలిన విభాగాలకు కోట్ల రూపాయలు వృధాగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. ప్రజల ఆరోగ్యం పట్ల అలవిమాలిన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ రంగాన్ని మనమేమీ వ్యతిరేకించ నక్కర్లేదు. కానీ వారిని బాగుచేయటం కోసం కోట్లాదిమంది ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాల్ని ఫణంగా పెట్టి అప్పులపాలు చేయటం మాత్రం క్షమార్హం కాదు.

2) సమాజంలో నైతికత, సౌభ్రాతృత్వం పెంచవలసిన బాధ్యతను పూర్తిగా పక్కనపెట్టి విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు సాగుతున్నాయి. ఆదాయం కోసం సారా వినియోగాన్ని ఉద్దేశపూర్వకంగా పెంచడం, ఓట్ల కోసం కులతత్వాన్ని, మత తత్వాన్ని పెంచి ప్రయోజనం పొందడం రాజకీయ పార్టీలకి అలవాటుగా మారింది. ఆ సంకుచిత ప్రయోజనాల కోసం దేశభక్తి, దేశభద్రతలని కూడా విస్మరిస్తున్నారు. పైకి మాత్రం భరతమాత, జాతీయజెండా అంటూ వల్లెవేస్తూ ప్రజల్ని వివశుల్ని చేస్తున్నారు. అణగారిన వర్గాల సమస్యలని చట్టసభల దృష్టికి తెచ్చి వారి విస్తృత ప్రయోజనాల కోసం పనిచేయటానికి రాజకీయ రిజర్వేషన్లతో ఎన్నికైనవారు, ఉద్యోగ రిజర్వేషన్లతో ప్రభుత్వోద్యోగులైనవారు కూడా తమ కులాల్లోని పైస్థాయి వారి (క్రీమీలేయర్) కోసమే పనిచేస్తున్నారు. రిజర్వేషన్ వర్తించే కులాల్లోనే రిజర్వేషన్ అవకాశాలు అందని నిర్భాగ్యులు కోట్లాది మంది ఉన్నారు. మైనారిటీల ప్రతినిధులుగా వ్యవహరించేవారు తమ వెనక నిలబడిన అల్పసంఖ్యాకుల ప్రజల సౌకర్యాలకంటే ఛాందసవాదానికి ప్రాముఖ్యత ఇస్తున్నారు. లంచగొండితనాన్ని మొదటి నుంచి సహించడం వల్ల.. అది పెరిగి నాయకులకు, ప్రభుత్వోద్యోగులకు ప్రధాన లక్ష్యంగా మారింది. కింది స్థాయి, ఒక మాదిరి హోదా ఉద్యోగులను పట్టుకున్నా కూడా.. వందల, వేల కోట్ల రూపాయలు దొరుకుతున్నాయి.

3) రానున్న కాలంలో మనకున్న పరిమిత వనరులపై భారాన్ని తగ్గించే విధానాలపై ఆలోచన కూడా చేయటం లేదు. జనాభా నియంత్రణ వంటి అంశాలను పట్టించుకోవటం లేదు. జనాభాను వనరులకు తగ్గట్టు నియంత్రించుకున్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలలో ఎడాపెడా కోత విధించేంత బాధ్యతారాహిత్యంతో పార్టీ రాజకీయాల్ని ప్రభుత్వాలు చేస్తున్నాయి.

ఈ పరిస్థితికి కారణం రాజకీయాలని సమాజం పాడుచేయటమా లేక తద్విరుద్ధమా? అన్నది 'చెట్టు ముందా.. విత్తు ముందా?' అన్న ప్రశ్న వంటిదే. ఈ దిగజారుడుకి బాధ్యత ప్రజలది కూడా అయినా.. రాజకీయ పార్టీలు ఎక్కువ బాధ్యత తీసుకోవాలి. భారత్ వంటి పేద, తీవ్ర అసమానతలున్న దేశంలో, ఎన్నో కులాలు, మతాలు, భాషలు, వాటి చుట్టూ వివక్షలూ ఉన్న దేశంలో అందుకు తగ్గరీతిలో ప్రజలు పాలనలో భాగస్వాములయ్యేలా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పాలకులదే. అలాంటి వ్యవస్థ నిర్మాణంలో మనం తొలి నుంచీ విఫలమయ్యాం. అలాగే మచ్చలేని వ్యక్తిగత నిజాయతీ ఉన్న నాయకులు కూడా ఎన్నికల్లో ఎలాగోలా నెగ్గినాక కూడా దేశంలో మార్పులు తెచ్చే బాధ్యతను తీసుకోవటం లేదు. ఎన్నో ఆశలతో ఎన్నుకున్న నాయకులు రోజువారీ ఫైళ్ల క్లియరెన్స్‌నే, యథాతథ స్థితినే గొప్ప పాలనగా అభివర్ణిస్తుంటే, దేశంలో మార్పు తెచ్చే నిజమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించకుంటే.. వందడుగులు ముందుకెళ్లాల్సిన దేశం పదడుగులతో సరిపెట్టుకుంటూ ఉంటుంది. ఇప్పుడు మనదేశంలో జరుగుతోందదే. అధికారంలోకి వచ్చాక వచ్చే ఎన్నికల్లోనూ దాన్ని నిలబెట్టుకోవాలని ప్రభుత్వంలోనివారు, ఎలాగోలా వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని ప్రతిపక్షంలోనివారు ఉచ్చనీచాలు లేకుండా కొట్లాడుకోవటం తప్పితే, దేశ ప్రజల అర్హతకు తగ్గ అభివృద్ధిని అందించే ప్రయత్నాలు మాత్రం చేయటం లేదు.

కొన్ని భౌతిక సూత్రాలు ఈ సందర్భానికి కూడా వర్తిస్తాయి..

ఎ) మొదటి సూత్రం: చర్యకి, ఫలితానికి మధ్య కాలవ్యవధి ఉంటుంది. అది ఫలితమే మొదలవని కాలం (డెడ్ టైమ్), ఫలితం మొదలై పూర్తిస్థాయికి చేరుకునే కాలం (రెస్పాన్స్ టైమ్)గా ఉంటుంది. నీటి పాత్రని మంటపై పెట్టిన గంటకి నీరు మరగడం చూస్తాం. సమాజ మార్పు విషయంలో చర్యకి, చూడగలిగిన ఫలితానికి మధ్య సంవత్సరాల వ్యవధి ఉంటుంది. పూర్తి ఫలితాలకి దశాబ్దాలు పట్టవచ్చు. విద్యారంగంలో సంస్కరణల ఫలితాలను ఒక జనరేషన్ తరువాతనే చూస్తాం.

దీర్ఘకాలిక ఫలితాలు భవిష్యత్ తరాలకు మేలు చేస్తాయి. స్వల్పకాలిక ఫలితాలు ప్రస్తుత తరానికి లాభిస్తాయి. అందువలన రాజకీయంలో రెండింటినీ సరైన పాళ్లలో కలపాలి (రైట్ మిక్స్). కానీ ప్రతి 5 ఏళ్లకి ఎన్నికల్లో పోరాడాల్సిన రాజకీయ పార్టీలు.. స్వల్పకాలంలో భ్రమలు కల్పించే చర్యలపైనే ఆసక్తి చూపుతున్నాయి.

ఖర్చు లేకుండా రాజకీయాలు ఉంటేనే దీర్ఘప్రయోజనాలకై ప్రయత్నించే రాజకీయ నాయకులు ఉంటారు. డబ్బు రాజకీయాల్లో అధికారమే లక్ష్యంగా పనిచేసే నాయకులే ఉంటారు. ప్రస్తుత రాజకీయాలు ధనరాజకీయాలు కావటమే అనేక సమస్యలకు దారితీస్తోంది.

నియోజకవర్గాలవారీగా గెలవాల్సిన అవసరం.. ఖర్చును పెంచుతోంది. కొన్ని వర్గాలను సంతుష్టపరచాల్సిన అవసరం ఆచరణీయ ఆదర్శాలను, జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలను తాకట్టుపెడుతోంది.

ఈ వైకల్యాలను అధిగమించాలీ అంటే కింది మార్పులు ఉపకరిస్తాయి.

1) చట్టసభలలో దామాషా పద్ధతిని అనుసరించి పార్టీలకు ప్రాతినిధ్యం ఉండాలి. జేపీ సూచిస్తున్న మరొక అంశం.. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికను కూడా చేపట్టాలి.

2) ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. దీర్ఘకాలిక వ్యూహాలు, జాతి ప్రయోజనాల పట్ల జాతీయ ఏకాభిప్రాయం ఉండాలి.

బి) రెండవ సూత్రం: ఏదైనా బయటి పరిణామాలు, శక్తుల ప్రభావంతో తప్ప దేశంలో మార్పుల్ని తేవాలని రాజకీయ పార్టీలు భావించటం లేదు. యథాతథ స్థితినే కొనసాగిస్తున్నాయి.

రాజకీయ నాయకులు సమాజాన్ని ఉన్నదున్నట్టే చూస్తున్నారు తప్ప, చిన్న మార్పులు మాత్రమే తేవాలని ప్రయత్నిస్తున్నారు తప్ప.. పెద్ద మార్పులు తేవాలనుకోవటం లేదు. పెద్ద మార్పుల కోసం ప్రయత్నిస్తే ఎదురుదెబ్బలు తగులుతాయని భయపడుతున్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ఎన్నికలో పాల్గొనే పార్టీలు తమ వ్యూహాలు, తప్పుడు హామీల ఫలితాల్ని విశ్లేషించుకోవడంలోనే బిజీగా ఉంటున్నాయిగానీ, మార్పుని తెచ్చే బైటి శక్తులు కాలేకపోతున్నాయి.

ఎన్నికల్లో పాల్గనే రాజకీయ నాయకులకు భిన్నంగా.. సామాజిక రాజకీయం చేసే పౌరనేతలు, ఆదర్శభావాల యువత ఉన్న సమాజాన్ని కాకుండా, సమాజం ఎలా ఉండాలీ అన్న అంశంపై దృష్టి పెడతారు. యథాతథ స్థితిని కాకుండా, చేరాల్సిన గమ్యం వైపు వీరు చూస్తుంటారు. అందువల్లనే ఈ సామాజిక (రాజకీయ) నాయకులు వ్యవస్థను మార్చగల బాహ్య శక్తులు కాగలరు. వీళ్లు ధైర్యంగా వ్యవహరించగలరు, సహానుభూతితో దయాభరితంగా స్పందించగలరు. సమాజాన్ని నిర్దేశించగల, దాని విశ్వాసాన్ని పొందగల ఇలాంటి సామాజిక నేతల అవసరం ఈవేళ తెలుగు రాష్ట్రాలకి, మనదేశానికి ఎక్కువగా ఉంది. కొంతమంది ఉన్నప్పటికీ చాలా గ్యాప్ ఉంది. ఈ నాయకుల సంఖ్య ఒక 'క్రిటికల్ స్థాయి' దాటితే అది ఇన్ఫెక్షన్ అవుతుంది. వేగంగా విస్తరిస్తూ ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది. సామాన్య ప్రజలని రాజకీయాలకు అతీతంగా ఉత్తేజపరిచి, ఆదర్శ ఆలోచనల్ని ప్రేరేపిస్తుంది. ఈ చైతన్యంతో సమాజమే రాజకీయాలని నిర్దేశిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్‌ని పునర్నిర్మించి ధనిక దేశంగా మార్చడంలో రాజకీయ నాయకుల కంటే పరిశ్రమలు తదితర రంగాల నుంచి వచ్చిన సామాజిక నాయకులే ప్రధాన పాత్ర పోషించారు.

మనదేశంలో ఈ రోల్‌ని సామాజిక అవగాహన ఉన్న డా॥ జేపీ వంటి నాయకులు పోషిస్తూ, ఇన్‌స్పిరేషన్‌తో మరికొంతమందిని తయారుచేస్తూ ముందుకు నడిపిస్తుండాలి. ఇప్పటికే రెండు లక్షలమందికిపైగా యువతకి జేపీ వివిధ రూపాల్లో శిక్షణనిచ్చి ఏదోకస్థాయి సీరియస్‌నెస్ ఉన్న సామాజిక నాయకులుగా తయారుచేశారు. లోక్‌సత్తా సభ్యులు, అభిమానులు వంటివారు దీనికి అదనం. రాబోయే తరాలను తయారుచేసేందుకు కూడా ఆయన తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. నిజమైన రాజకీయం కోసం నిరంతరం కష్టపడుతున్నారు. ఈ స్థాయిలో కాకపోయినా.. సామాజిక అవగాహన ఉన్న మిగిలిన నాయకులు కూడా ఇదే మార్గంలో సమాజం బాధ్యతను తీసుకోవాలి, సామాజిక నాయకులను తయారుచేస్తుండాలి. తక్షణం ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనటం కంటే.. పార్టీలకతీతంగా సామాజిక రాజకీయ నాయకత్వం వహించేందుకు పెద్దఎత్తున యువత, ఇతర ప్రజలు ఎక్కడికక్కడ ముందుకు రావటం ఇప్పుడు దేశహితానికి అవసరం. ❖

# ప్రకృతి - సంరక్షణ - యువత

- ఎ. అన్నపూర్ణ, కాలిఫోర్నియా



పెద్దలు చిన్నపిల్లలను చేరదీసి వారికి ఆసక్తికరమైన నీతికథలు చెప్పటం మన సమాజంలో తరతరాలుగా కనిపిస్తుంది. వారికి ఇష్టమైన జంతువులు, నాయకుల చరిత్ర చెబుతూ నీతిని ఆలోచనను కలబోసి పెంచే రీతిలో ఆ కథలుండేవి. అదంతా పాత కాలమని, పాత పద్ధతులనీ నిర్లక్ష్యం చేయడం కాకుండా ఆ ప్రయత్నాన్ని కొనసాగించడం అవసరం. ప్రతీ అంశాన్నీ వినిపించడం, చదివి చెప్పడం ద్వారా పిల్లలనే కాదు, యువతను కూడా మంచి లక్ష్యాల వైపు మళ్లించటం అవసరం. ఇది పెద్దల బాధ్యత కూడా.

ఒక పెద్దాయన తన ఇంటి దగ్గరి స్థలంలో కొన్ని మొక్కలను నాటి వాటికి పాదు చేసి, ఎరువును తానే స్వయంగా తయారు చేసి, మొక్కలకు వేసి దూరాన ఉన్న బావి నుంచి నీరు తెచ్చి పోసి ఎంతో శ్రద్ధగా పెంచుతుండేవాడు. ఆ దారిన పోయే వారు– "ఆ మొక్కలు పెరిగి పెద్దవై కాయలు కాసి పండ్లుగా మారిన తర్వాత కడుపు నిండా తినాలనా? లేక వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనా?'' అన్నట్టుగా ఎకసెక్కాలాడుతుండేవారు. అయినా మాట్లాడకుండా ఆయన తన పని తాను చేస్తుండేవాడు. ఒకరోజు ఆయనతోపాటు ఆయన మనవడు కూడా వచ్చాడు. తాత చేస్తున్న పనిని చూసి తాను కూడా తన చిన్నారి చేతులతో ఆయనకు సాయపడ్డాడు. చిన్న బాటిల్‌తో నీళ్లు పోశాడు. మొక్క చుట్టూ పళ్లెంలా చేశాడు. ఆ తర్వాత ఎందుకిలా చేస్తున్నావ్ తాతా? అనడిగాడు. "చిట్టితండ్రీ! ఈ మొక్కలు పెరిగి పెద్దవవుతున్నాయి. చూడు, నీ అంత ఎత్తుకి ఎదిగాయి. ఇవి చెట్లుగా మారేసరికి నువ్వు, నీ చెల్లి కూడా పెద్దవాళ్లవుతారు. చెట్లు కాయలు కాసి పండ్లుగా మారేటప్పటికీ నేనున్నా లేకున్నా మీరు తప్పకుండా ఆ పండ్లు తింటారు. మీతోపాటు స్నేహితులకు, చుట్టూ ఉన్నవారికీ పంచుతారు. తర్వాతి తరాలకు అందిస్తారు. ఈ చెట్లు మా తాత, ముత్తాత వేసినవి అని నన్ను తల్చుకుంటారు. అంతేకాదు, ఈ చెట్ల నుంచి వచ్చిన పండ్లు, వాటి గింజలు పక్షులు, ఆవులు, మేకలు కూడా తింటాయి. వీటి వలన అంతటి ప్రయోజనం వుంటుంది. అదే నేను కోరుకుంటున్నది" అని తన ప్రయత్నం వెనకాల ఆలోచన గురించి చెప్పాడు. ఇందులో భవిత పట్ల ఎంతటి మహత్తరమైన ఆశయం, బాధ్యత ఉంది! రాబోయే తరాలకు ఎంత చక్కటి మార్గదర్శకత్వం ఉంది!! కొన్ని తరాలుగా వస్తున్న ఈ కథను ఎప్పుడో వచ్చిన తెనాలి రామకృష్ణ సినిమాలో కూడా ఉపయోగించి దర్శకనిర్మాతలు పాప్యులర్ చేసే ప్రయత్నం చేశారు.

చరిత్ర గురించిన పాఠాల్లో అశోక చక్రవర్తి గురించి చదివినప్పుడు దారికిరువైపులా చెట్లు నాటించి దారిన పోయే జనానికి నీడ, పశు పక్ష్యాదులకు ఆహారమూ సమకూర్చిన మంచి పాలన గురించి తెలుసుకున్నాం. అలాగే హైదరాబాద్‌ను పాలించిన కొందరు నవాబులు చెరువులు తవ్వించారు అనీ చదువుకున్నాం. కానీ ఈవేళ ప్రకృతి సూత్రాలబద్ధంగా పరిపాలన చేయటం తగ్గిపోతుండటం బాధాకరం. మరీ కాలుష్యం, వాతావరణం వేడెక్కటం, కుంభవృష్టి వంటివి పెరుగుతుండటంతో సంవత్సరానికోసారి 'ఎర్త్ డే' జరపటం, ఎవరైనా అపురూపమైన అతిథులు వచ్చినప్పుడు, జ్యోతిష్కులు చెప్పినప్పుడు, నిధులొస్తాయి అనుకున్నప్పుడు మొక్కలు నాటటం వంటి పనులు చేయటం ఆనవాయితీగా మారింది. అవి పెరిగి పెద్దయ్యాయా, పాతవి వందల ఏళ్ల నాటి వృక్షాల జీవితకాలం ముగిసినప్పుడు వాటి స్థానంలో కొత్తవి నాటుతున్నారా అనేవి ఎక్కడా పెద్ద చర్చ చేయం, పట్టించుకోం.

పూర్వీకులు సమకూర్చిన సంపదను యధేచ్ఛగా వినియోగించుకుంటున్న మన మీద.. ఆ సంపదను మరింత సౌకర్యవంతంగా రాబోయే తరాలవారికి కూడా అందించాల్సిన బాధ్యత ఉందని గుర్తించకపోవటం విషాదం!

ఇలాంటి స్థితిలో ఆమధ్య పత్రికలో వచ్చిన ఒక వార్త చాలా సంతోషం కలిగించింది. ఒక రైతు తన స్థలంలోని చెట్లను తొలగించాలని అనుకున్నప్పుడు మరో వ్యక్తి ఆ చెట్లను తాను కొనుక్కుని తన స్థలంలో నాటుకున్నారన్నదే ఆ వార్త. అది చదివినప్పుడు.. పర్యావరణం, ప్రకృతి పట్ల ఆరాధన అంతరించిపోతున్నా ఇంకా ఆశావహ పరిస్థితులన్నాయన్న ధైర్యం వచ్చింది. అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో వందల ఏళ్లనాటి చెట్లు వున్నాయి. ప్రతీ ఇంటి ముందూ ఒకటి లేదా రెండు చెట్లు వుంటాయి. ఆ ఇల్లు కొన్నవారికి ఆ చెట్లు కూడా స్వంతమవుతాయి. ఆ ఇంటి యజమాని ఆ చెట్ల బాధ్యతను స్వీకరించాలి. జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎండిపోయిన కొమ్మలు గాలి దుమారాలకు విరిగిపోయి రోడ్డు మీద నడిచేవారిపై పడే ప్రమాదం ఉంటుంది కనుక తగిన జాగ్రత్తగా కొమ్మలను పగ్గాలతో కట్టి తొలగిస్తారు. చెట్టుకి చెద పట్టినా, కూలిపోయే అవకాశమున్నా చెట్టును తొలగించి మరో కొత్త చెట్టు నాటాలి. ఈ బాధ్యతను అప్పగిస్తూ ఇంటిని స్వాధీనం చేయటం ఒక రూలు కూడా. ఇలా సంరక్షించటం వలన చెట్లు పచ్చగా కళకళలాడుతూ ఉల్లాసం కలిగిస్తాయి. నేలల తీరును బట్టి ఆయా ప్రాంతాలలో పెరిగే చెట్లు, పూల మొక్కలను నాటుకుంటారు. అలాంటి జాతి వృక్షాలు కనువిందు చేస్తుంటాయి.

బ్రిటీషువారు పరిపాలించిన కాలంలో వాళ్ల దేశం నుంచి తెచ్చి అమెరికాలో నాటిన మొక్కలు, స్థానికంగా ఉన్న వృక్షజాతులు, వాతావరణం మారినప్పుడు రంగులు మార్చుకునే ఆకులతో ఉన్న వృక్షాలు.. ఇలా ఎన్నెన్నో రకాలు ఆహ్లాదాన్ని పంచుతుంటాయి. అటవీ ప్రాంతాలు కూడా పుష్కలంగా ఉంటాయి.

తిరుమల తిరుపతి కొండల అడవుల్లోని ఎర్రచందనం చెట్లు ఎంతో కాలంగా కొట్టుకుపోతున్నా స్మగ్లర్లను అరికట్టే వ్యవస్థ ఇంకా పకడ్బందీగా లేదు. సెక్యూరిటీని ఏర్పాటు చేసినా వాళ్లు కూడా పంచుకుంటున్నారని, రాజకీయ నాయకులకు ఎన్నికల విరాళాలనిస్తుండటంతో స్మగ్లర్లను అడ్డుకోవటం పోలీసులకు కూడా సాధ్యం కావటం లేదని అంటున్నారు. మన రాజకీయ, ఎన్నికల వ్యవస్థలు, పోలీసు యంత్రాంగం పనితీరు వంటి కారణాల వల్ల రక్షణ కరవవుతోంది. స్వదేశంలోని కలపను దొంగలపాలు చేసి రెట్టింపు ఖర్చు చేసి విదేశీ కలపను కొనుక్కుంటున్నామంటే దేశం ఎంతగా వెలిగిపోతోందో చెప్పనక్కర్లేదు. ఆధారాలతో పట్టుబడుతున్నా శిక్షలుండవ్. బెయిలుతో దర్జాగా బైటపడి యధావిధిగా కార్యకలాపాలు కొనసాగిస్తూనే వుంటారు. నిజాయితీపరులైన అధికాలున్నా వారిని వేధిస్తూ నిస్సహాయులను చేస్తున్నారు. ప్రకృతి వనరులు ప్రజల కోసమే వినియోగించాలన్న కట్టుబాటు లేదు. ఇసుక, మట్టి, ఎరువులు, జంతుచర్మాలు అదీ ఇదీ అంటూ లేదు, ప్రతి వస్తువూ అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకోవటం చూస్తున్నాం. ఆ మధ్య ఒక సోదరుడు హైదరాబాద్ నుంచి నాకు మెయిల్ రాశారు... "ఇక్కడి యువత (ఆడమగ తేడా, పిల్లలూవృద్ధులూ అనే అంతరం లేదు) ప్రతీ వీకెండ్‌లో స్ట్రీట్ డ్యాన్సర్లుగా మారి గంతులు వేస్తున్నారు. నా బోటి వాళ్లం వెళ్లి 'దీని వుద్దేశం ఏమిటో చెప్పగలరా?' అని అమాయకంగా అడిగాం. 'ప్రతిరోజూ ఉద్యోగం, వంట చేసుకుని తినటం, సినిమా చూడటం, ఏదో ఒక పర్యటనకు వెళ్లి డబ్బు ఖర్చు చేయటం కంటే ఖర్చు లేని ఎక్సర్‌సైజ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కదా అంకుల్! రోజూ ఒకే పని చేసీ చేసీ బోర్ కొట్టింది. అవెట్లాగూ అయిదు రోజులూ వుండేవే. అందుకే మా యూత్‌కి కొత్త ఆలోచన వచ్చింది. మీరు కూడా ఆంటీని తీసుకురండి. అన్నట్టు మీరు ఎన్నారై కదా, కొత్త ఐటం సాంగ్స్ మాకు నేర్పగలరు. మీరు అమెరికాలో ఏం చేసేవారు? ఇలాగే కద' అన్నారు. నాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు. ఒక మాట మాత్రం చెప్పాను. 'మీకు ఖాళీ వుంటే, నాకు టైం ఇస్తే మేము అమెరికాలో ఏం చేస్తామో వచ్చే వారం చెప్తా' అన్నాను. ఏమనుకున్నారో సరే అన్నారు.

తీరా నేను నెక్స్ట్ వీక్ ఆ చోటుకి వెళితే యధాప్రకారం వాళ్ల ఆటపాటలు డ్యాన్సులు కొనసాగిస్తున్నారు. నేను వెనక్కి తిరిగి రాబోతుండగా నలుగురు యువకులు, ఇద్దరు మహిళలు, నలుగురు మధ్యవయస్కులు సారీ చెబుతూ అలా పార్కులోకి వెళ్లి మాట్లాడుకుందామని తీసుకెళ్లారు. అమెరికా వీకెండ్ కార్యక్రమాల గురించి చెప్పమన్నారు. 'వారానికి ఒకరోజు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షించటం, మరొకవారంలో లైబ్రరీలో సోషల్‌వర్క్, మరోవారం సీనియర్ సిటిజన్ హోమ్స్‌లో వారికి కావలసిన సహాయం చేయడం, మరొకవారం క్యాన్సర్ బారినపడినవారిని కలిసి వాళ్లకు ఇంట్రెస్ట్ వున్న విషయాల్లో కథలు చెప్పటం– ఇలా వీకెండ్ నాలుగువారాలు చేసి మళ్లీ నెల రిపీట్ చేస్తాం. అంతేకానీ ఇలా ఒళ్లు మరిచిపోయి గంతులు వేయం' అంటూ వివరంగా చెప్పాను. వాళ్లు ఎంతవరకు పాటిస్తారో తెలియదు గానీ సోదరీ.. యువత ఇలా ఏవో అర్థంలేని అనుకరణల్లో, భ్రమల్లో కాలాన్ని వృథా చేయటం బాధ కలిగిస్తోంది.

వినోద కార్యక్రమాలు చేయకూడదని కాదు. కానీ వీటికి ఒక అర్థం ఉండాలి. ధ్యేయం ఉండాలి. మంచిని పెంచే సందేశం ఉండాలి. అవి స్పష్టంగా తెలిసివుండాలి. అంతేగానీ మోడ్రన్ కల్చరంటూ క్లబ్బుల్లో చేసే నృత్యాలు నడిరోడ్డు మీద చేయటం ఆరోగ్యకరమైన వినోదం అనిపించుకోదు. అమెరికాలోనో, లండన్‌లోనో, ఇంకొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలోనో కొన్ని పెడధోరణులున్నా వారు ఒక అర్థం, పరమార్థంతోనే కార్యక్రమాల్లో పాల్గంటారు. స్వేచ్ఛ, విచ్చలవిడితనం అక్కడేదో ఉందని, అదేదో గొప్పని మనం దాన్నింకా అనారోగ్యకర స్థాయికి తీసుకెళ్లనక్కర్లేదు. ఈ విషయాన్ని వీళ్లు అర్థం చేసుకోవటం లేదు. అమెరికా నుంచి వచ్చి చెబుతున్నారా బాబూ అని మనలాంటి వాళ్లం చెప్పినా నచ్చటం లేదు" అంటూ రాశాడు.

నాకు చాలా బాధ కలిగింది. నిజమే! యువత సరైన రీతిలో ఆలోచిస్తే ఎన్నో ప్రయోజనకరమైన పనులు చేయగలరు. ఆదర్శాలలో, ఆవేశంలో వారు ఏ తరంలోని గొప్ప యువతకూ తీసిపోరు. కానీ నేటి తరం దృష్టి ఎందుకనో ఎంటర్‌టైన్‌మెంట్, రిలాక్సేషన్ పేరుతో చాలా అల్పమైన విషయాల మీదకే ఎక్కువగా వెళ్తోంది. ఏది చేస్తే మనకు, సమాజానికి, తద్వారా మళ్లీ మనకు ఉపయోగమో బేరీజు వేసుకోవాలి. తన స్వార్థానికి, అభివృద్ధికి అర్థాన్ని తెలుసుకోవాలి. లేదా ఎవరైనా మెంటార్ నుంచి తీసుకోవాలి. గతంలోలా మనకు చుట్టుపక్కలే మెంటార్లు ఉండనక్కర్లా. సాంకేతిక పరిజ్ఞానముంది, అప్పుడప్పుడూ నేరుగా సభలు, సమావేశాలకు వెళ్లవచ్చు, ప్రత్యక్షంగా మాట్లాడవచ్చు, సోషల్ మీడియాలో రోజూ టచ్‌లో ఉండవచ్చు.. ఈ రకంగా గొప్ప రోల్ మోడల్స్‌ని మెంటార్లుగా ఎంచుకునే అవకాశం యువతకు ఈరోజు ఉంది. వ్యక్తిత్వ వికాస నిపుణులు, సీబీఐ మాజీ జేడీ వి.వి లక్ష్మీనారాయణ వంటి వారు ఆదర్శవంతమైన జీవితానికి కావలసిన సరంజామాను అందించగలరు. వ్యక్తిగత స్థాయితోపాటు వ్యవస్థీకృత స్థాయిలో కూడా నిజాయతీతో ఎదగగలిగే, ఆధ్యాత్మికం సహా పరిపూర్ణ జీవితాన్ని ఆస్వాదించే భావజాలాన్ని, జీవనశైలిని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లాంటి వారి నుంచి నేర్చుకోవచ్చు. పాఠశాల స్థాయి నుంచి కూడా ఈ వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక దృక్పథానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇందుకోసం నాణ్యమైన చదువును అందించటం మీద రాజకీయ వ్యవస్థ, సమాజం బాగా దృష్టి పెట్టాలి. ప్రకృతి, పర్యావరణ సంరక్షణలో చిన్నప్పటి నుంచీ భాగస్వాముల్ని చేయాలి. ఇలా అన్నిటితో అనుసంధానమై, అన్నిటినీ సమన్వయం చేసుకుంటూ బతికే జీవనశైలిని మనం పాటిస్తూ యువతకు, బాలలకు అందిస్తే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది, మన బాధ్యతను కూడా సక్రమంగా నెరవేర్చినవారమవుతాం, లైఫ్‌ని నిజంగా ఎంజాయ్ చేయగలుగుతాం.

# భోగాపురం రైతులకు అండగా అఖిలపక్షం



అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డు విమానాశ్రయం పేరుతో విజయనగరం జిల్లా భోగాపురంలో 5311 ఎకరాలు సేకరించిన ప్రభుత్వం తమకు సరిపోయే 2633 ఎకరాల భూమికి చెల్లింపులు చేసి మిగతా భూమిపై ఏం మాట్లాడకుండా తొక్కిపట్టిందని అఖిలపక్ష రాజకీయ నేతలు తీవ్రంగా తప్పుపట్టారు. 2688 ఎకరాల మిగులు భూములనిచ్చిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. భోగాపురం రైతులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నేతృత్వంలో పార్టీ జిల్లా కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. భూములిచ్చిన రైతులు గడచిన మూడు సంవత్సరాలుగా ఎంతో నష్టపోయినా జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని బాబ్జీ అన్నారు. భూసేకరణలో మిగులు భూములున్న గూడెపువలస, కంచేరుకప్పలవాడ, రావాడ, ఎ.రావివలస, సవరవిల్లి, కంచేరుపాలెం, దల్లిపేట, ముంజేరు గ్రామాల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం ఏదోక విషయం రైతులకు తేల్చిచెప్పాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మూడు సంవత్సరాల నష్టపరిహారం ఇవ్వాలని, కౌలురైతులుంటే వారిని కూడా ఆదుకోవాలని సమావేశం తీర్మానించింది. రౌండ్‌టేబుల్‌లో వైసీపీ నేత రొంగలి పోతన్న, సీపీఎం నాయకుడు రెడ్డి శంకర్రావు, సీపీఐ నేత బుగత అశోక్, జనసేన ప్రతినిధి రామకృష్ణ (బాలు), బీఎస్పీ ఆర్జీ శివప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు భానుమూర్తి, ప్రజాసంఘాల ప్రతినిధులు బోడి ఆదినారాయణ, రామేశ్వరపు రామారావు, పాండ్రంకి వెంకట రమణ, లోక్‌సత్తా నేతలు నాగభూషణం, నాయుడు, రాజారావు, శ్రీను, రాజు, చంద్రరావు, సన్యాశినాయుడు, ఎర్నిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్‌కి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా 2016 ఏప్రిల్‌లో అందించిన 'అందరికీ ఆరోగ్యం' విధానం నమూనాలోని ముఖ్యాంశాలు

ఢిల్లీ నుంచి గ్రామం వరకు ప్రజల జేబులో నుంచి రూపాయి ఖర్చులేకుండా మనదేశంలో 'అందరికీ ఆరోగ్యం' అందించటం కోసం లోక్‌సత్తా/ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) రూపొందించిన నమూనా విధానాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ తన బృందంతో కలిసి ఏప్రిల్ 25, 2016న నీతి ఆయోగ్ ముందు ప్రజెంట్ చేశారు. అంతకుముందు ఈ నమూనాపై న్యూఢిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీహెచ్‌ఎఫ్ఐ) అధ్యక్షుడు డా॥ కె.శ్రీనాథ్ రెడ్డితోపాటు వైద్య ఆరోగ్య రంగంలో అనుభవమున్న నిపుణులు చర్చలో పాల్గొన్నారు. ప్రపంచ దేశాల అనుభవాల్ని అధ్యయనం చేసి భారతీయ పరిస్థితులకనుగుణంగా జేపీ రూపొందించిన జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ను గ్రామీణ హెల్త్ మిషన్‌గా కుదించి పలు పరిమితులతో 2005లో యూపీయే ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. జాతీయ హెల్త్ మిషన్ రూపకర్తగా, ప్రపంచ దేశాల విధానాలను మారిన పరిణామాలకనుగుణంగా తిరిగి అధ్యయనం చేసి తాజా దేశీయ ఆరోగ్య నమూనా విధానాన్ని జేపీ రూపొందించారు. ప్రభుత్వ బాధ్యతతో అమలయ్యే ఈ విధానానికి ప్రైవేటు, కార్పొరేట్ రంగం చిక్కులు సృష్టించకుండా వారిని కూడా చాలావరకు ఒప్పించారు. ఇందుకోసం పలు సమావేశాల్ని నిర్వహించారు. పలు ఆస్పత్రుల్ని సందర్శించారు.

ఇప్పుడు కూడా .. మోదీ ప్రభుత్వం ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్' స్కీం (జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం) లోని లోపాలు దేశ ఖజానాకు, ప్రజారోగ్యానికి ఎంత నష్టం చేకూరుస్తాయో వివరిస్తూ, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో కూడిన ప్రాథమిక ఆరోగ్యం తదితర సూచనలను బడ్జెట్ పరిధిలోనే అందించేందుకు నీతి ఆయోగ్‌తోపాటు పలువురు నేతలు, ప్రజాప్రతినిధులతో జేపీ మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో 2016లో నీతి




ఆయోగ్‌కు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా సమర్పించిన అందరికీ ఆరోగ్యం విధానం నమూనాలోని ముఖ్యాంశాలు..

**ప్రాథమిక స్థాయిలో జీతాల విధానం బదులు నచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రజలు ఎంచుకునే విధానం**

లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ నమూనాలో గ్రామస్థాయి నుంచి ప్రతి కుటుంబానికి కొంతమంది ఫిజీషియన్లు అందుబాటులో ఉంటారు. వీరికి జీతాలిచ్చే వ్యవస్థ లేకుండా, సేవలతో పోటీపడి సంపాదించుకునే విధానం ఉంటుంది. వీరు ఎంబీబీఎస్ చదివి ఫ్యామిలీ ఫిజీషియన్లుగా శిక్షణ పొందినవారై ఉంటారు. ఈ వైద్యులు తాము ఎంపికచేసుకున్న గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలు తమ వైద్యసేవలు తీసుకునేట్టుగా రిజిస్టర్ చేసుకుంటారు. రిజిస్టర్ అయిన ఒక్కో వ్యక్తికీ వైద్యసేవల కోసం ప్రభుత్వం కాస్త అటూఇటుగా ఏటా రూ.600 వైద్యునికి చెల్లిస్తుంది. ఎంత ఎక్కువమంది ప్రజలను వైద్యుడు/వైద్యురాలు నమోదుచేసుకుంటే అంత ఎక్కువ ఆదాయం వారికి వస్తుంది. ఇలా ఓ మెరుగైన వైద్యునికి ఏడాదికి రూ.30లక్షలకు పైగా కనీస ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. గ్రామాలలో సేవలందించటానికి వారు గ్రామంలో నివాసముండాల్సినే నిబంధన ఉండదు. అందుబాటులో ఉండేలా సమీప పట్టణంలో ఉండవచ్చు. పట్టణాల్లో, నగరాల్లో విపరీత పోటీని ఎదుర్కొంటున్న వైద్యులకు ఇది సువర్ణావకాశమే అవుతుంది. ఇక్కడ జెనెరిక్ మందుల్ని ఉచితంగా అందిస్తారు, టీకాలు వంటి కార్యక్రమాల్ని చేస్తారు. ప్రభుత్వం జీతాలిచ్చే ప్రస్తుత వ్యవస్థకు ఇది విప్లవాత్మకమయిన ప్రత్యామ్నాయం.

**రెండోదశలో తాలూకా స్థాయిలో ప్రభుత్వ కమ్యూనిటీ సెంటర్లు-ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య పోటీ**

రెండోదశ వ్యాధుల చికిత్సలో తాలూకా స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, ప్రయివేటు నర్సింగ్ హోంలకు మధ్య పోటీ ఉంటుంది. ప్రసూతి కేసుల దగ్గర్నుంచి ఎవరు మెరుగైన చికిత్సనందిస్తే, సేవలనందిస్తే వారికి ఆకర్షణీయ చెల్లింపులు ఉండేలా ఈ దశలో ఏర్పాటు ఉంటుంది. ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డుల్ని నమోదు చేసి మొత్తం దేశ ఆరోగ్యరికార్డుని తయారుచేస్తారు. ఇప్పటివరకూ ప్రభుత్వం కేవలం కొన్ని రకాల జబ్బులకు మాత్రమే పీపీపీ నమూనాలో ప్రయివేటు వైద్యులకు చెల్లిస్తోంది. లోక్‌సత్తా నమూనాలో ఏ జబ్బుకైనా మెరుగైన ఆసుపత్రిని ఎంపికచేసుకునే అవకాశం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

**తృతీయ దశలో జిల్లాస్థాయిలో ఎయిమ్స్‌లాంటి ప్రభుత్వ వైద్యసంస్థలు**

వ్యాధి తృతీయదశలో జిల్లా స్థాయి వైద్య సంస్థలుంటాయి. ఈ దశ చికిత్సలో ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ ఉంటుంది కాబట్టి ఇక్కడ కార్పొరేట్ భాగస్వామ్యానికి అవకాశం లేకుండా ఈ నమూనాలో ఏర్పాట్లు ఉంటాయి. ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) వంటి సంస్థలను, తక్కువ ఖర్చుతో మెరుగైన సేవల్ని అందించే శంకర నేత్రాలయ, నారాయణ హృదయాలయ వంటివాటిని మాత్రమే ప్రోత్సహిస్తారు. ఇప్పుడు జరుగుతున్నట్టు ప్రభుత్వం నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు వేలకోట్లు పంచిపెట్టటం ఉండదు.


- గ్రామాల్లో కుటుంబ వైద్యుల ప్రాక్టీస్‌కు అనుమతినిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాంతీయ ఆరోగ్య ట్రస్టు ఉంటుంది. వైద్యసేవలను పర్యవేక్షించేందుకు జిల్లా బోర్డులు, తప్పు జరిగితే విచారణకు అంబుడ్స్‌మన్‌లు ఉంటాయి.
- లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యం నమూనా సరిగ్గా అమలయితే భారం లేకుండా అందరికీ వైద్యం, ఆరోగ్యం అందటమే కాకుండా, యువతకు రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కూడా లభ్యమవుతాయి.

తాము ప్రతిపాదిస్తున్న అందరికీ ఆరోగ్యం నమూనాను అమలు చేస్తే వచ్చే 2022నాటికి ప్రాథమిక, నివారించదగ్గ వైద్యసేవలకు రూ.80,000 కోట్లు, రెండోదశ సేవలకు రూ.40,000కోట్లు, తృతీయదశ సేవలకు రూ.93,000కోట్లు ఖర్చవుతాయని జేపీ ఈ సందర్భంగా తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కూడా అంచనావేసి లెక్కిస్తే మొత్తం రానున్న ఏడేళ్లలో (దశలవారీ పెరుగుదలతో) రూ.3.5 – 3.8 లక్షల కోట్లు ఖర్చవుతాయని, ఇది జీడీపీలో కేవలం 1.67శాతం మాత్రమే ఉంటుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీ కంటే కూడా తక్కువ ఖర్చుచేస్తే చాలని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరోగ్య రంగానికి నిధుల్ని జాతీయ ఆదాయంలో 2.5శాతానికి పెంచుతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పగా, 2.3 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ఎన్నికల హామీల్లో పేర్కొన్నాయని, లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన నమూనాలో ఇప్పుడు ఖర్చు చేస్తున్న 1.1శాతానికి మరో 0.5శాతం కలిపి పెంచితే అందరికీ ఆరోగ్యం అందుతుందని వివరించారు. మనదేశంలో ఉన్న వైద్యసిబ్బంది నైపుణ్యాలు, చౌకగా మందుల తయారీ, సాంకేతికత, ప్రజల్లో డిమాండ్ వంటి సానుకూల అంశాలను ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఈ విధానాన్ని రూపొందించినట్టు చెప్పారు.

భారత ఆరోగ్యరంగానికున్న సంక్షోభానికి మూలం వ్యాధుల

## అభివృద్ధికి ప్రధాన సంకేతం ఆరోగ్యం

–డా॥ జయప్రకాష్ నారాయణ్



అభివృద్ధికి ప్రధాన సంకేతం మనిషి ఆరోగ్యం. కానీ మనదేశంలో ఇప్పటికీ అకాల మరణాలు, నివారించదగ్గ వ్యాధులు, సులభంగా చికిత్స చేయదగ్గ జబ్బులు అసంఖ్యాకంగా అమాయకుల్ని బలితీసుకుంటున్నాయి. నివారించదగ్గ క్లేశాలు భారతదేశంలో ఉన్నంతగా మరెక్కడా కానరావు. ఇందుకు చాలా సులభ పరిష్కారాలు మన ముందున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో అమలయ్యే మార్గాలనేకం ఉన్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో డాక్టర్ అరోలీ దంపతులు దశాబ్దాల క్రితం తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఆరోగ్య ఫలితాలు చూస్తే– మన సమస్యలను ఎంత సులభంగా పరిష్కరించవచ్చో విశదమవుతుంది. వెల్లూరు వైద్య కళాశాలలో పట్టభద్రులయిన డాక్టర్ రజనీకాంత్ అరోలీ, ఆయన భార్య మేబెల్– ఇరువురూ అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి 1970లో మహారాష్ట్రలో మారుమూల ప్రాంతమయిన జాంఖేడ్‌లో నివాసమేర్పరచుకున్నారు. ఆ దంపతులకు ఆనాటికే ఓ విషయం స్పష్టంగా తెలిసివచ్చింది. నూటికి 90 జబ్బులకు ఖరీదయిన వైద్యం అక్కర్లేదు. ఎన్నో అంటువ్యాధులను సులభంగా గుర్తించి చికిత్స చేయవచ్చు. చాలా రోగాలకు వ్యాధి నిరోధక టీకాలిస్తే జబ్బు రాకుండా నివారించవచ్చు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో రకాల జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. పౌష్టికాహారం మెళకువలను పాటిస్తే చాలా వ్యాధులను నిరోధించవచ్చు. మాతాశిశుసంరక్షణ సూత్రాలను పాటిస్తే ఎందరో గర్భిణులను, పసిపాపలను రక్షించవచ్చు. వీటన్నింటికీ వైద్యులే అవసరం లేదు. అలాగని అసలు వైద్యులు అవసరమే లేదని కాదు. కొన్ని క్లిష్టమయిన వ్యాధులను గుర్తించడానికి, సరైన చికిత్స చేయటానికి, శస్త్రచికిత్సలకు, కొన్ని మందుల వాడకానికి విధిగా వైద్యులు కావాలి. ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణనివ్వటం కోసం, వైద్యుడి సహాయం అవసరమున్న రోగులకు చికిత్సనందించటం కోసం జాంఖేడ్‌లో అరోలీ దంపతులు ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వారి కృషి వల్ల అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు వచ్చాయి. 1970ల చివరినాటికి ఆ 70 గ్రామాలలోని లక్ష జనాభాకు ఆధునిక ఆరోగ్య పద్ధతులు

అందుబాటులోకి వచ్చాయి. ఆ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు–జీవన కాలపరిమితి, మాతా శిశు మరణాలు, వివిధ వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య వగైరా అంశాలలో– ప్రపంచంలో సంపన్న దేశాలకు ఏరకంగానూ తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించగలిగారు. 1979లో అరోలీ దంపతులకు మెగసెసే అవార్డు అందింది. ఆరో పంచవర్ష ప్రణాళికకు ఆరోగ్యరంగంలో జాతీయ సలహాదారుగా అరోలీని మన ప్రభుత్వం నియమించింది. ఆయన కృషిని అందరూ పొగిడారు. కాగితం మీద ఆ విధానాలనే రాసిపెట్టారు. కానీ వాస్తవానికి ప్రజలకు ఆరోగ్యం అందకుండా చేశారు. గ్రామీణ మహిళలను ఎంపికచేసి శిక్షణనిచ్చేది పోయి, పలుకుబడి గలవాళ్ల పిల్లలను ఎంపికచేశారు. ప్రజలకు ఆరోగ్యం అందించే లక్ష్యంతోకాక ప్రభుత్వోద్యోగం దక్కి నెల జీతం వస్తుందనే ఆశతో వేలమంది యువకులు లంచాలిచ్చి ఆరోగ్య కార్యకర్తలుగా చేరారు. నాయకులకు, అధికారులకు చిత్తశుద్ధి, సంకల్పం, అవగాహన, సామర్థ్యం కొరవడటంతో ఆ పథకం నీరుగారిపోయింది. ఇప్పుడు పాలకులలో చాలామందికి అసలు అరోలీ పేరే తెలియదు. గూండాలకు నీరాజనాలందించి, లంచగొండులను నెత్తికెక్కించుకుని, అసమర్థులను అందలాలెక్కించే వ్యవస్థలో నిజంగా దేశాన్ని సమూలంగా సంస్కరించగల మహనీయుల కృషి ఫలితాలను పొందే విజ్ఞత కూడా కరవయింది. చీటికీమాటికీ వేలు, లక్షలు ఖర్చు చేసి ఖరీదయిన ఆసుపత్రులలో వైద్యం పొందగల సంపన్నులకు, నిజాం ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందే అవకాశమున్న నాయకులకు, అధికారులకు సామాన్యుల కడగండ్లు కానరావు. లక్షలమంది పేదలు, అల్పాదాయ వర్గాలవారు చిన్నచిన్న జబ్బులకు కూడా సరైన వైద్యసౌకర్యం లేక, వైద్యం అందుబాటులో లేక సతమతమవుతున్నారు. సంపన్నులు, విద్యావంతుల కంటే చిన్న రుగ్మతలకు పేదలు ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. అమూల్యమయిన కాలాన్ని పోగొట్టుకుంటున్నారు. జబ్బు పడుతున్నామనే భావనే సగటు మనుషుల్ని కుంగదీస్తోంది. ఒక్కోసారి జబ్బుపడితే– సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం ఉండాలేగానీ, అతి తక్కువ ఖర్చుతో, స్థానికుల సహకారంతో ఎవరికీ తీసిపోని ఆరోగ్య ప్రమాణాలను సాధించటం చిటికెలో పని. ఆ ఫలితాలను అందరికీ అందించటం నాగరికులమనుకునే మన ప్రథమ కర్తవ్యం. బీదరికాన్ని నిర్మూలించాలంటే ఆరోగ్యాన్ని అందరికీ అందించే వ్యవస్థను నిర్మించాలి. ఒక వ్యక్తి పుట్టుక, కులం, హోదా, ఆస్తిపాస్తులు.. ఇందులో దేనితోనూ సంబంధం లేకుండా సహేతుకమైన, సరైన ప్రమాణాలుగల వైద్యసదుపాయాలు అందరికీ అందాలి.

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 2002, 2004లో ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల నుంచి)**


చికిత్సకన్నా నివారణకు కీలకమైన ప్రాథమిక ఆరోగ్య దశలో వైఫల్యమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. గ్రామాలలో వైద్యసేవలు అందకపోవటం, ఏ జబ్బుచేసినా జిల్లా స్థాయి ఆసుపత్రులకు, బోధనాసుపత్రులకు రావాల్సిఉండటంతో ప్రయివేటు, కార్పొరేటు దోపిడీకి ప్రజలు బలవుతున్నారన్నారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన విధానంలో ఈ ప్రాథమిక వైద్యరంగంలో పూర్తిగా స్వేచ్ఛా మార్కెట్ పోటీ ఉంటుందని, ఎంతమంచి సేవలు అందించి ఎంతమంది ప్రజలను ఆకట్టుకుంటే ఆ వైద్యునికి అంత ఎక్కువ ఆదాయం లభిస్తుందని వివరించారు.

అందరికీ ఆరోగ్యం ఇవ్వాలని 12వ పంచవర్ష ప్రణాళికలో (2012–17) హామీ ఇచ్చినా ఒక నమూనాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయానికి రాకపోవటం వల్ల ఇప్పటికీ ఆ కీలక సంక్షోభం అలాగే కొనసాగుతూ ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది మరణిస్తున్నారని, 97 లక్షలమంది మలేరియా బారిన పడుతున్నారని, 25లక్షల మందికి టీబీ సోకుతోందని, ఆసుపత్రుల పాలయినవారు సగటున ఒక్కొక్కరూ రూ.40,000 ఖర్చు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో కేవలం 0.5శాతం పెంచితే ఈ దేశానికి అద్భుతాలు జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ఆమాత్రం కూడా బడ్జెట్‌ను పెంచలేమని అంటే, ఇక ప్రభుత్వాలు అక్కర్లేదన్నారు. తాయిలాలు, రుణమాఫీలు వంటి పథకాలుకాకుండా అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం ఉచితంగా ప్రభుత్వమే అందించే బాధ్యత తీసుకుంటేనే పేదరికం, వివక్ష తొలగిపోయి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు వస్తాయని తొలినుంచీ వాదిస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కొన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించిందని, తాజాగా పూర్తిస్థాయి ఫలితాల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

కేంద్ర, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో, పార్టీలతో కూడా కూర్చుని నిర్మాణాత్మక వాదనలతో ఒప్పించి సరైన పద్ధతుల్లో, భారం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని సాధించేందుకు దృఢసంకల్పంతో ప్రయత్నిస్తున్నామని, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాలని, జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

(నీతి ఆయోగ్ ద్వారా మోదీ ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన అందరికీ ఆరోగ్యం విధానం నమూనా పూర్తి వివరాల్ని www.fdrindia.org లో చూడవచ్చు)

# ఏపీ వైద్య, ఆరోగ్య రంగం ప్రక్షాళనకు జేపీ బృందం అందించిన పరిష్కారాలు




'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో పూర్తయిన తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా యాత్రలో బైటపడ్డ సమస్యలను, పరిష్కారాలను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిసెంబర్ 14, 2017న అమరావతిలో కలిసి వివరించారు. లిఖితపూర్వక నివేదికను, గ్రాఫిక్ ప్రజంటేషన్‌ను అందించారు. పార్టీలకతీతంగా చేపట్టిన సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలలో 'ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా అన్ని స్థాయిలలో మంచి ఆరోగ్యం' ఒకటి. వైద్యారోగ్యంపై ప్రజల్లో అవగాహనను పెంచేందుకు, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు జేపీ ప్రతి జిల్లాలోని పెద్దాస్పత్రులను, పలు ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఏపీ ప్రభుత్వానికి జేపీ అందజేసిన నివేదికలో.. ఈ వివరాలను మదింపు చేసి రూపొందించిన పరిష్కారాలు కూడా ఉన్నాయి. త్వరలో తెలంగాణలో కూడా ఇదే తరహాలో ఆరు లక్ష్యాలతో జేపీ సురాజ్య యాత్ర జరగనుంది.

ఏపీ ప్రజారోగ్యంలో సంక్షోభానికి చికిత్సగా ముఖ్యమంత్రికి జేపీ అందించిన పరిష్కారాలు స్థూలంగా..

- **వ్యయాన్ని 0.27శాతం మేర పెంచటం**
- **పెంచిన నిధుల్ని నిర్దిష్ట అంశాలకే వినియోగించటం**
- **ఎంబీబీఎస్ డాక్టర్లతో ప్రాథమిక వైద్యసేవలకు ఫ్యామిలీ డాక్టర్ల నెట్‌వర్క్ వ్యవస్థ ఏర్పాటు చేయటం**
- **తమ ఫ్యామిలీకి ఏ డాక్టర్‌ని ఎంచుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను ప్రజలకే ఇవ్వటం**
- **తాము రిజిస్టర్ చేసుకున్న డాక్టర్ వద్ద ప్రజలకు ఉచిత సేవల్ని అందించటం, ఎంతమంది రిజిస్టర్ చేసుకుంటే అంతమంది పేరున తలసరి చెల్లింపుల్ని డాక్టర్‌కి ప్రభుత్వమే చేయటం**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు అన్నిటికీ మందుల సరఫరాలను కేంద్రీకృత పర్యవేక్షణలోకి తేవటం, పారిశుద్ధ్య

# SOLUTION
## *Strengthen Primary Care Services*

- **Establish Primary Care Networks In 500 Towns:**
  - Network of 10 doctors to provide primary care for 70,000-100,000 population.
  - People register their families with one of the **doctor of their choice** in the network.
  - Network doctors will be remunerated on per capita basis for their registered persons (Rs. 400/capita/year).

**1500 families registered/doctor or 6000 persons/doctor**

**Rs. 24 lakhs/year or Rs. 2 lakhs/month**

  - 1 month onboarding training on family care for doctors.
  - Contracted doctors to establish a clinic and hire support staff to assist in care delivery.
  - Population can seek care from government hospitals only on referral, except in case of emergencies.

| SERVICES PROVIDED |
|---|
| Family care and outpatient care |
| MCH care (except deliveries) |
| Monitor NCDs |
| Simple lab tests |
| Dispensing drugs supplied by government |
| Hospital recordkeeping |

పనుల్ని ఔట్‌సోర్సింగ్ చేయటం, ఎన్టీఆర్ వైద్యపరీక్ష, 60 సేవలకు కొత్తగా ఏర్పాటు చేసిన 103 ల్యాబ్‌ల ద్వారా ప్రధాన వైద్యపరీక్ష సేవల్ని ఉచితం చేయటం వంటివి ఏపీ వైద్యవిధానంలో మంచి పరిణామాలకు దోహదం చేశాయి. కానీ చేయాల్సిన మార్పుతో పోలిస్తే ఇవి చాలా చిన్నవి.

**కేంద్ర 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్' చట్టాన్ని విజ్ఞతతో పక్కన పెట్టిన ఏపీ,**

**రాష్ట్ర పరిస్థితులకనుగుణంగా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా బిల్లు**

అలాగే కేంద్రం రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం (సీఈఏ)లో ఉన్న లోపాల రీత్యా ఆ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టింది.

సంబంధిత మంత్రిత్వశాఖ విజ్ఞప్తి మేరకు.. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా మెరుగైన సీఈఏ బిల్లును రూపొందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ రంగంలోని వారందరినీ సంప్రదించి రాష్ట్ర అవసరాల కనుగుణంగా ఈ చట్టాన్ని తయారుచేయటమైనది. దీనివల్ల ఆస్పత్రి సేవలను సక్రమంగా ప్రజోపకరంగా నియంత్రించే అవకాశం ఏపీ ప్రభుత్వానికి లభిస్తుంది.

**ఇచ్చే నిధులకు అనేకరెట్లు సేవలు**

ప్రభుత్వ ఆరోగ్యరంగంలో నిధులు తక్కువ, సేవలు మాత్రం అనేకరెట్లు ఎక్కువగా ఉండటాన్ని బట్టి.. ఈ రంగానికి నిధులిస్తే చాలామేర ప్రజల ఆరోగ్య సమస్యలకు చౌక పరిష్కారం లభించే అవకాశముందని స్పష్టమవుతోంది.

- ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రభుత్వం ఏడాదికి రూ. 70లక్షలు ఖర్చు చేస్తోంది.
- మైదానప్రాంతాల్లో ఒక్కో పీహెచ్‌సీ 60,000మందిని కవర్ చేస్తోంది. అదే ప్రభుత్వ హైస్కూలును తీసుకుంటే.. 11,520మంది జనాభాను కవర్ చేస్తుంటే, దీనికి రూ. 1.8కోట్లు వెచ్చిస్తోంది.
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విషయానికొస్తే, చిలకలూరిపేటనే ఉదాహరణగా తీసుకుంటే ఇక్కడ ప్రభుత్వం 1.3 – 1.4 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ ఇక్కడ అందిస్తున్న సేవల విలువ రూ. 5–8కోట్లుగా ఉంది.
- అలాగే ఏరియా ఆస్పత్రుల్లో పార్వతీపురాన్ని తీసుకుంటే.. ఇక్కడ ఇన్‌పేషెంట్లు 200–220 వరకు ఉన్నారు (అధికారికంగా ఉన్న పడకలు 100 మాత్రమే). ఔట్‌పేషెంట్లు రోజుకు 1500–2000 దాకా వస్తున్నారు. ప్రభుత్వం ఇక్కడ పెడుతున్న ఖర్చు ఏడాదికి రూ. 5కోట్లుకాగా, ఇక్కడ అందిస్తున్న సేవల విలువ దాదాపు రూ. 50కోట్లు దాకా ఉంటుంది.

- బోధనాస్పత్రుల్లో ప్రభుత్వ ఖర్చు ఏడాదికి రూ. 60-70కోట్లు ఉండగా, సేవలు రూ. 300-400కోట్లు దాకా అందుతున్నాయని అంచనా.

బలహీనమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ, రోగులతో కిటకిటలాడే, నిధులకు కటకటలాడే ప్రభుత్వాస్పత్రులు, తగినంత జీతభత్యాలు లేని వైద్యసిబ్బంది.. వైద్య ఆరోగ్య రంగంలో ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

**రెండు పరిష్కారాలు**

వైద్య రంగానికి వ్యయాన్ని ఆచరణసాధ్యంగానే కొంత పెంచటం, ప్రాథమిక ఆరోగ్య సేవా నెట్‌వర్క్‌ని పటిష్టంగా ఏర్పాటు చేయటం పరిష్కారాలు.

ఒకటి) ఈ వ్యయాన్ని కూడా ఒకేసారి పెంచనక్కర్లేదు. ఏడాదికి రూ. 3లక్షలు చొప్పున ఒక్కో పడకకు రెండేళ్ల చొప్పున పెంచితే చాలు. ఈ డబ్బును..

- డాక్టర్లు, నర్సులు, ఏఎన్ఎంలు తదితర వైద్యసిబ్బందికి మెరుగైన జీతాలివ్వడానికి
- మెరుగైన పరికరాల (ఎక్స్-రే యంత్రాలు, ల్యాబ్ పరికరాలు వగైరాలు)కి
- మెరుగైన మౌలిక వసతులు, అవసరమైన చోట అదనపు బెడ్‌లకు
- రక్తనిధుల ఏర్పాటు (అవసరాన్ని బట్టి)కు
- మందుల సరఫరా పెంచటం (అవసరాన్ని బట్టి) కోసం వినియోగించాలి. ప్రస్తుతం స్పెషలిస్టు డాక్టర్‌కి నియామక సమయంలో రూ. 45,000 జీతం అందుతుండగా, నర్సులకు రూ. 16,000 మాత్రం నెలజీతం. నర్సులకు మెటర్నిటీ లీవు, హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేవు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు నెలకు రూ. 12,000 ఇస్తున్నారు. వీరికి కూడా మెటర్నిటీ లీవులు, ఆరోగ్య బీమా లేవు. సీనియర్ రెసిడెంట్ల (కంపల్సరీ సర్వీసులో ఉన్న స్పెషలిస్టు డాక్టర్లు)కు నెలకు రూ. 33,000 ఇస్తున్నారు. ఈ చెల్లింపుల్ని కూడా నెలలు, సంవత్సరాల తరబడి జాప్యం చేస్తుంటారు. ఈ పరిస్థితిని మార్చాలి.

రెండవది) 500 పట్టణాల్లో ప్రాథమిక వైద్య సేవల నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయాలి:

- 70,000 నుంచి 1,00,000 జనాభాకు ప్రాథమిక వైద్యాన్ని అందించటానికి 10మంది డాక్టర్లతో నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయాలి.
- ప్రజలు తమ కుటుంబసభ్యుల పేర్లను నెట్‌వర్క్‌లో 'తమకు నచ్చిన' డాక్టర్ వద్ద రిజిస్టర్ చేసుకుంటారు. వీరు ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తారు.
- ఎంతమంది రిజిస్టర్ చేసుకుంటారో అంతమంది పేరున తలసరి చెల్లింపుల్ని డాక్టర్‌కి ప్రభుత్వం చేయాలి (ఉదాహరణకు ఏడాదికి ఒక్కొక్కరి పేరు మీద రూ. 400). ఇలా 1500 కుటుంబాలు నమోదైతే, ఆ డాక్టర్ వద్ద సుమారు 6000మంది ప్రజలు రిజిస్టర్ అయినట్టు. అంటే డాక్టర్‌కి రూ. 24 లక్షలు ఏడాదికి వస్తాయి. నెలకు రూ. 2లక్షలన్నమాట.
- ఫ్యామిలీ కేర్ సేవలపై డాక్టర్లకు 1 నెలరోజుల పాటు శిక్షణనందించాలి.
- ఇలా ఒప్పందం కుదుర్చుకున్న వైద్యులు క్లినిక్‌ను ఏర్పాటు చేసుకుని తమకు కావలసిన సహాయ వైద్యబృందాన్ని ఏర్పాటు చేసుకుంటారు.
- ప్రజలు తాము రిజిస్టర్ చేసుకున్న ఫ్యామిలీ డాక్టర్ వద్ద ఉచిత సేవలు పొందుతారు. పైస్థాయి ఆస్పత్రుల్లో ఉచితంగా సేవలు పొందాలంటే ఫ్యామిలీ డాక్టర్ రిఫర్ చేయాల్సి ఉంటుంది. ఎమర్జెన్సీ కేసులకు మాత్రం మినహాయింపు ఉంటుంది.

**0.27శాతం అదనపు నిధులు అవసరం**

వైద్యరంగాన్ని ఈ మార్పుల్ని తెచ్చి ప్రజలందరికీ ఖర్చు లేకుండా మెరుగైన వైద్యాన్ని అందించటానికి అదనంగా రూ. 2,000 కోట్లు మాత్రమే ఖర్చవుతాయి. ఇది ఏపీ జీఎస్‌డీపీలో కేవలం 0.27శాతం మాత్రమే. కానీ వచ్చే లాభం మాత్రం అనేకరెట్లు ఎక్కువగా ఉంటుంది.

**ఈ పెంపులో..**


- ప్రాథమిక వైద్యసేవల నెట్‌వర్క్ ఏర్పాటుకు రూ. 1700కోట్లు (3కోట్లమంది రిజిస్టర్డ్ జనాభా ఉంటారను కుంటే, తలసరి రూ. 400 చొప్పున)
- ప్రాథమిక వైద్యసేవలకు ఇప్పుడున్న సిబ్బంది జీతాలు పెంచటానికి రూ. 100కోట్లు
- ఏడాదికి రూ. 3లక్షల చొప్పున రాష్ట్రంలోని ఆస్పత్రి పడకలకు కేటాయింపులు పెంచటానికి రూ. 600 కోట్లు ఖర్చవుతాయి.

# జనారోగ్యం ధనార్పణం

## -సార్వజన చికిత్సే తరుణోపాయం-

- పీఎస్ఎం రావు

విద్య, వైద్య రంగాలను విపణి శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం సమాజానికి మహా ప్రమాదకరం. వీటిపై ప్రభుత్వ నియంత్రణ తగ్గేకొద్దీ వ్యాపారసంస్థల పట్టుపెరుగుతుంది. నానారకాల అవకతవకలు చోటుచేసుకుంటూ ఈ రంగాలు విషాద భరితంగా మారుతున్నాయి. ఆమధ్య ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 60మంది పిల్లలు మరణించారు. నెలరోజుల తరువాత అదే రాష్ట్రంలోని ఫరూఖాబాద్‌లో అదే దుర్ఘటన పునరావృతమై మరో 14మంది బాలలు చనిపోయారు. వ్యవస్థాపరమైన ఘోర నిర్లక్ష్యం ఈ విషాదాలకు మూలం. వైద్యరంగంలో మరెన్నో అకృత్యాలు జరుగుతున్నాయి. రోగికి వైద్యఖర్చులు చెల్లించే ఆర్థికస్తోమత ఉందా లేదా అనే అంశం ఆధారంగానే అతడు లేక ఆమెను ఆస్పత్రిలో చేర్చుకుంటున్నారు. రోగ తీవ్రతను, శస్త్రచికిత్స ఆవశ్యకతలను పట్టించుకోవడం లేదు. రోగి పనిచేస్తున్న సంస్థ కాని, ప్రభుత్వం లేదా బీమా కంపెనీ కాని అతడి వైద్యఖర్చులను ఎంతవరకు భరించగలవనే అంశం ఇక్కడ అమిత ప్రాధాన్యం వహిస్తోంది. దీంతో రోగికి డబ్బుంటే అవసరమున్నా లేకున్నా చికిత్స చేసిన సందర్భాలు తటస్థిస్తున్నాయి. ఆర్థిక స్తోమత ఉన్న చాలామందికి వ్యాధి తీవ్రత లేకపోయినా ఖరీదైన చికిత్స చేసేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఉండీ డబ్బు లేకపోతే బయటకు పంపేస్తున్నారు!




**విలువల పతనం**

రోగ నిర్ధారణ కేంద్రాలు ఇచ్చే ముడుపులకు ఆశపడి అనేకమంది వైద్యులు అవసరం లేకపోయినా రోగులకు వివిధరకాల పరీక్షలు చేయిస్తున్నారు. వైద్యుడికి, రోగనిర్ధారణ (డయాగ్నస్టిక్ సెంటర్ లేదా లేబరేటరీ) కేంద్రాలకు మధ్య నడిచే ఈ అక్రమ లావాదేవీలకు సంకేత భాష ఉంది. దాని గుట్టుమట్లు రోగికి తెలియవు. సింక్ టెస్టులు దీనికి ఓ ఉదాహరణ. ఇక్కడ సింక్ అంటే 'వాష్ బేసిన్' అని అర్థం. దీని కింద రోగికి చేయాల్సిన రెండు మూడు ముఖ్యమైన రక్తపరీక్షలను వైద్యుడు సంకేత లిపిలో గుర్తుపెడతారు. లేబరేటరీ నిర్వాహకులు రోగి నుంచి రక్తనమూనా సేకరించి వైద్యుడు సూచించిన పరీక్షలతోపాటు మిగిలిన పరీక్షలూ చేసినట్టు తమ నివేదికలో లిఖిస్తారు. నిజానికి వారు వైద్యుడు చెప్పిన పరీక్షలు మాత్రమే చేసి, మిగతా రక్తనమూనాలను సింక్ (వాష్ బేసిన్)లో పారబోస్తారు. అందుకే వీటిని సింక్ టెస్టులంటారు. నివేదిక తయారుచేసేటప్పుడు వైద్యుడు చెప్పిన పరీక్షల ఫలితాలను మాత్రం కచ్చితంగా రాసి, మిగతా పరీక్షల ఫలితాలన్నీ సవ్యంగా, సాధారణంగా ఉన్నట్టు సూచిస్తారు. రోగి నుంచి పిండుకున్న అదనపు మొత్తాన్ని ఉభయులూ పంచుకొంటారు.

వైద్యులు కానీ, వైద్య సంస్థలు కానీ ప్రత్యక్షంగా లేక పరోక్షంగా రోగులను తమ వద్దకు రప్పించుకోవడానికి ప్రయత్నించకూడదని నిర్దేశించినా దాన్ని ఎవరూ ఖాతరుచేయడం లేదు. వైద్య రంగంలో లాభాపేక్ష వెర్రితలలు వేస్తోంది. వైద్య రంగంలో ఉన్నత ప్రమాణాలు, విలువలను కాపాడటానికి కట్టుబడి ఉన్నామని, అందుకు పకడ్బందీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఉద్ఘాటించింది. వైద్యరంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో నూతన ఆరోగ్య విధాన లక్ష్యాలను అందుకోవడానికి కొత్త వ్యూహాలు అనుసరించాలి.

ప్రస్తుతం భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 1.2శాతమే ప్రజారోగ్యంపై ఖర్చు పెడుతున్నాం. 2022నాటికి దీన్ని మూడు శాతానికి పెంచాలని ప్రణాళికా సంఘం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో నెలకొల్పిన ఉన్నతస్థాయి నిపుణుల బృందం సిఫార్సు చేసింది. ఆరోగ్యంపై వ్యయంలో ప్రపంచ సగటు అయిదు శాతం. ప్రజారోగ్యానికి నిధుల కేటాయింపు పెరగాలని, వీటిని సార్వత్రిక పన్నుల ద్వారా రాబట్టాలని శ్రీనాథ్‌రెడ్డి సంఘం సిఫార్సు చేసింది. వైద్య రంగంలో ప్రైవేటు రంగ సంస్థల పాత్ర పెరుగుతూ ప్రభుత్వ పాత్ర తగ్గిపోవడం వల్ల ఆరోగ్య

## దిగ్భ్రాంతికర మోసాలు

+ రోగులను అనవసరంగా ఇతర వైద్య నిపుణుల వద్దకు పంపుతారు. రోగి నుంచి వసూలు చేసే రుసుమును మొదటి వైద్యుడు, రెండో వైద్యుడు పంచుకుంటారు. ఎక్కువ వాటా ఇచ్చే వైద్యుల వద్దకు ఇలాంటి కేసులను ఎక్కువగా పంపుతారు.

+ చట్టవిరుద్ధ లింగనిర్ధారణ పరీక్షలూ విరివిగా జరుగుతున్నాయి. మగబిడ్డ కావాలంటే గణేష్ అని, ఆడపిల్ల కావాలంటే లక్ష్మి అని సంకేతభాష నడుస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఇతర సంకేత నామాలు చలామణిలో ఉన్నాయి.

+ అవనసర శస్త్రచికిత్సలు అధికమయ్యాయి. అవసరం లేకపోయినా గర్భసంచి తొలగించడం, సిజేరియన్ ఆపరేషన్లు చేయడం, కంటి శుక్లాలు తొలగించడం, మోకాలి చిప్పమార్పిడి, వెన్ను కింది భాగంలో శస్త్రచికిత్సలు చేయడం నేడు సర్వవ్యాప్తమయ్యాయి. ఇవన్నీ కాసుల కక్కుర్తితోనే జరుగుతున్నాయి.

+ ఔషధ తయారీ సంస్థలు వైద్యులకు ఖరీదైన బహుమతులు, వైద్య పరికరాలు, ఇతర తాయిలాలు ఇచ్చి తమ మందులనే రాసేట్టు ప్రలోభపెడతాయి. వైద్యులను, వారి కుటుంబాలను విదేశీ విహార యాత్రలకు తీసుకెళ్లి విహార యాత్ర ఖర్చులన్నింటినీ తామే భరిస్తాయి. వైద్యులు చౌక జనరిక్ మందులనే సిఫార్సు చేయాలన్న భారత వైద్యమండలి (ఎంసీఐ) నిబంధనను ఉల్లంఘించి డాక్టర్లు, మందుల కంపెనీలు కుమ్మక్కవుతున్నాయి.

+ అత్యవసరంగా చికిత్స చేయాల్సిన రోగులను తమ వద్దకే తీసుకొచ్చేట్టు ప్రైవేటు ఆస్పత్రులు అంబులెన్స్ డ్రైవర్లను ప్రలోభపెడుతున్నాయి.

+ వైద్యులకు భారీ పారితోషికాలు ఇస్తున్నాం కాబట్టి వారు తమకు నెలనెలా భారీ ఆదాయం వచ్చేట్టు చూడాలని ప్రైవేటు ఆస్పత్రులు ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో వైద్యులు అనవసర పరీక్షలు, చికిత్సలు చేయడం ఎక్కువైంది. సొంతంగా క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు నడిపే వైద్యులు తమ ప్రాంగణంలో మందుల దుకాణాలు, ప్రయోగశాలలు పెట్టి, రోగులు తప్పనిసరిగా అక్కడి మందులే కొనేట్టు, పరీక్షలు చేయించుకునేట్టు చూస్తున్నారు.

+ వైద్యరంగంలో నిజాయతీ, నైతిక విలువలను కాపాడటానికి ఉద్దేశించిన నిబంధనలన్నిటినీ యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. సాటి వైద్యులు అవినీతికి, అవకతవకలకు పాల్పడితే, ఆ విషయం బైటపెట్టాలని నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. రోగి చికిత్సకన్నా వైద్యుడి ఆర్థిక ప్రయోజనాలు ఎక్కువ కాదని, వైద్యుడు ఎవరికీ ఏకపక్షంగా చికిత్స నిరాకరించకూడదని, అనవసరంగా వైద్యపరీక్షలు చేయించకూడదని, చీటికీ మాటికీ ఇతర వైద్యుల సలహాల కోసం పంపకూడదని కూడా స్పష్టం చేస్తున్నాయి.

సంరక్షణకు ప్రజలు భారీగా వెచ్చించాల్సి వస్తోంది. వైద్యఖర్చులు తట్టుకోలేక పేద, మధ్యతరగతి వర్గాల నడ్డి విరిగిపోతోంది.

### అందని ప్రభుత్వ వైద్యం

నేడు పల్లె, పట్టణ ప్రాంతాల్లో 70శాతానికిపైగా వ్యాధుల చికిత్సకు ప్రైవేటు ఆస్పత్రుల మీదనే ఆధారపడాల్సిన దుస్థితి ఉందని 2014లో జాతీయ నమూనా సర్వే నిర్ధారించింది. ఆస్పత్రి పడకల మీద చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య ప్రైవేటు ఆస్పత్రుల్లోనే అత్యధికం. ప్రభుత్వం రకరకాల ఆరోగ్య పథకాలను ఆర్భాటంగా ప్రకటించినా 86శాతం గ్రామీణులకు, 82శాతం పట్టణ జనాభాకు ఈ పథకాలేవీ వర్తించడం లేదు. గ్రామ, పట్టణ కుటుంబాలన్నీ సొంత జేబు నుంచే చికిత్స ఖర్చులు పెట్టుకోవలసి వస్తోంది. వైద్యం కోసం పల్లె కుటుంబాలు చేసే వ్యయంలో 25శాతం అప్పుమీద తెచ్చినదైతే, పట్టణ కుటుంబాలు 18శాతం మేర అప్పులు తెచ్చుకుంటున్నారు. ఈ తరహా రోగుల చికిత్స వ్యయంలో మందుల కొనుగోలుకే దాదాపు 70శాతం ఖర్చవుతోంది. ఇక గ్రామాల్లో 20శాతం, పట్టణాల్లో 11శాతం శిశుజననాలు ఆస్పత్రుల బయటే సంభవిస్తున్నాయి. పల్లెల్లో ప్రతి శిశు జననానికి సగటున రూ.5,544 ఖర్చయితే, పట్టణాల్లో రూ.11,685 వ్యయమవుతోంది. ఇది అల్పాదాయ, మధ్యాదాయ కుటుంబాలకు తలకుమించిన భారమే. ఒకవైపు పేద, మధ్యతరగతి ప్రజానీకం చికిత్స చేయించుకుని దివాలా తీస్తుంటే, కార్పొరేట్ ఆస్పత్రులు, ఔషధ సంస్థలతో వైద్యులు కుమ్మక్కయి కాసుల పంట పండించుకుంటున్నారు. వ్యాధులు, వాటికి చికిత్స చేయించుకోవడం వల్ల ఏటా కోట్లమంది పేదరికంలోకి జారిపోతున్నారని అంచనా. 2017 సంవత్సరంలో 16వేల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకున్న ఆరోగ్య రక్షణ రంగం, 2020 కల్లా 28వేల కోట్ల డాలర్లకు చేరుకోనుంది. 2000-17 మధ్యకాలంలో ఈ రంగానికి అందిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 434 కోట్ల డాలర్లు. 2015లో విదేశాల నుంచి వైద్యం కోసం భారత్‌కు వచ్చిన రోగుల సంఖ్య 1.30లక్షలు. 2016కల్లా వారి సంఖ్య రెండు లక్షలకు చేరింది. వైద్య రంగంలో ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు లాభాలు వర్తిస్తుండగా, సాధారణ ప్రజలకు మాత్రం మెరుగైన సేవలు లభించడం లేదు. ఈ పరిస్థితి మారాలంటే వైద్యాన్ని విపణి శక్తుల ప్రభావం నుంచి తప్పించాలి. బీమా పరిశ్రమతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ప్రజలందరికీ సార్వజన చికిత్సా సదుపాయాలను కల్పించాలి. లేకుంటే ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలో పడతాయి!

(కర్టెసీ: ఈనాడు)

# జనం నమ్మకంలో అట్టడుగున రాజకీయ పార్టీలు
## -ఏపీ, తెలంగాణల్లో పరిస్థితి మరీ ఘోరం-





**భా**రత్‌లోని ఎక్కువమంది ప్రజలు సైన్యాన్ని విశ్వసిస్తున్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందడంలో అట్టడుగు స్థానంలో ఉన్నది రాజకీయ పార్టీలు!

'భారత్‌లోని ప్రజలకు ఎవరిపై ప్రభావవంతమైన విశ్వాసం ఉంది' అనే అంశంపై అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం (ఏపీయూ), లోక్‌నీతి (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్) నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 22 శాసనసభ స్థానాల్లో, 16,680 మంది అభిప్రాయాలను సేకరించి ఈ అధ్యయనం నిర్వహించారు.

సైన్యంపై విశ్వాసం ఉందని 77 శాతం మందికి పైగా చెప్పారు. ఆ తర్వాతి స్థానాల్లో 54.8 శాతం, 48 శాతాలతో సుప్రీంకోర్టు, హైకోర్టు నిలిచాయి (ఏపీలో ఈ శాతం బాగా తక్కువగా ఉంది). జిల్లా కలెక్టర్ 47 శాతంతో నాలుగో స్థానంలో నిలిచారు.

అత్యంత విశ్వాసం వ్యక్తం చేసినవారి శాతం, అసలు విశ్వాసమే లేదన్న వారి శాతం మధ్య వ్యత్యాసాన్నే 'ప్రభావవంత విశ్వాసం'గా ఈ అధ్యయనం నిర్వచించింది. ఈ అధ్యయన వివరాలను 'ఇండియాస్పెండ్ వెబ్‌సైట్' ద్వారా వెల్లడించారు.

ఈ ఎనిమిది రాష్ట్రాల్లో పార్లమెంటుపై నమోదైన సగటు విశ్వాస శాతం 36.6. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిపై, పార్లమెంట్, శాసనసభ, పంచాయతీ/పురపాలక సంస్థ వంటి వాటిపై 40 శాతం మందే విశ్వాసం ఉంచారు.

రాజకీయ పార్టీలపై సగటున విశ్వాసం -1.75 శాతం ఉంది. ప్రభుత్వ అధికారులపై 4.8 శాతం మంది విశ్వాసం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో రాజకీయ పార్టీలపై అత్యధికంగా 31 శాతం విశ్వాసం వ్యక్తమైంది. ఈ రాష్ట్రంలో పార్లమెంటు, శాసనసభ, పంచాయతీ వంటి వాటిపై ప్రజలు పెట్టుకున్న విశ్వాస శాతం 63 దాకా ఉంది.


**ఏపీ, తెలంగాణలో..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల విశ్వాసం చూరగొనడంలో రాజకీయ పార్టీలు ఘోరంగా విఫలమైనట్టు ఈ అధ్యయనాన్ని బట్టి వెల్లడవుతోంది. రాజకీయ పార్టీలపై విశ్వాసం ఆంధ్రప్రదేశ్‌లో -24 శాతంగా నమోదు కాగా, తెలంగాణలో -21 శాతంగా ఉంది. మధ్యప్రదేశ్‌లో -9 శాతం, జార్ఖండ్‌లో -3 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో సర్వేలో పాల్గొన్నవారు సైన్యంపై అత్యధిక విశ్వాసం ఉంచినా ఇతర వ్యవస్థలన్నింటిపైనా అనుమానం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థపై మొత్తం మీద వెల్లడయిన సగటు విశ్వాసం 50 శాతమే కాగా ఏపీలో అందులో సగమే నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో సర్వేలో పాల్గొన్నవారికి ప్రధానమంత్రిపై నమ్మకం లేదు. మిగిలిన రాష్ట్రాల్లో 48 శాతం మందికి ప్రధానిపై విశ్వాసం ఉంది. ఏపీలో ప్రధానిపై ఉన్న విశ్వాసం -4 శాతం. రాష్ట్రపతిపైనా ఇంతే నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో సుప్రీంకోర్టుపై 21 శాతం, హైకోర్టులపై 20 శాతం, జిల్లా న్యాయస్థానాలపై 28 శాతం విశ్వాసం నమోదైంది. పార్లమెంటు, అసెంబ్లీ పట్ల రాష్ట్రంలో విశ్వాసం -4, -2 స్థాయిల్లో ఉంది.

'ప్రభుత్వం పనితీరుపై విహంగ వీక్షణం' పేరుతో 2016లో ఓఈసీడీ (ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ) నిర్వహించిన సర్వే ప్రకారం 73 శాతం మంది భారతీయులు తమ ప్రభుత్వం విశ్వాసాన్ని ప్రకటించారు. అమెరికాలో కంటే ఇది 43 శాతం ఎక్కువ. 2007లో ప్రభుత్వం పట్ల నమ్మకం 82 శాతం ఉండగా, ఇది క్రమంగా తగ్గుతూ వస్తోంది.

# ప్రత్యక్ష ఎన్నికే మందు!

- ఆర్కే




ఇటీవలికాలంలో రాజకీయాలలో చోటుచేసుకుంటున్న పరిణామాల కారణంగా అటు జాతీయ పార్టీలలోనూ, ఇటు ప్రాంతీయ పార్టీలలోనూ పార్టీ నిర్వహణ, మ్యాన్ మేనేజ్‌మెంట్ కత్తి మీద సాములా మారుతోంది. వివిధ పార్టీల మధ్య సిద్ధాంతాలు, విధానాల విషయంలో తేడా లేకపోవడంతో పార్టీ విధేయులు అన్న మాటకు తావు లేకుండా పోయింది. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి! ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీలూ ఫిరాయింపులను ప్రోత్సహించడంతో అధికారం కోల్పోయి నప్పుడు అవే పార్టీలు బాధిత పక్షాలుగా మిగిలిపోతున్నాయి. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఏ మాత్రం మొహమాటం లేకుండా పార్టీల నాయకత్వాలను ధిక్కరించడమో, ఫిరాయించడమో చేస్తున్నారు. దీంతో సొంత పార్టీ వారిని సముదాయించడమే ఆయా పార్టీల అధినేతలకు ప్రధాన పనిగా ఉంటోంది. కర్ణాటకలో చూడండి. మంత్రి పదవి రాలేదనో, ప్రాధాన్యం లభించలేదనో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అలకబూనడం, వారిని సముదాయించడం ఆ పార్టీ నాయకులకు ప్రధాన బాధ్యతగా మారింది. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. రాజకీయ పార్టీలలో క్రమశిక్షణారాహిత్యం పెచ్చరిల్లుతున్నా, పార్టీ నాయకులు అవినీతికి పాల్పడుతున్నా కట్టడి చేయలేని దుస్థితిలో అధినేతలు ఉంటున్నారు. జాతీయ పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులే కాదు– ప్రాంతీయ పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు కూడా తమ సమయంలో అత్యధిక భాగం మ్యాన్ మేనేజ్‌మెంట్‌కే కేటాయిస్తున్నారు. ముఖ్యమంత్రులుగా కొనసాగాలంటే శాసనసభ్యుల మద్దతు అవసరం. దీంతో శాసనసభ్యులకు కోపం రాకుండా చూసుకోవలసిన బాధ్యత ముఖ్యమంత్రులపై ఉంటోంది. శాసనసభ్యులు తప్పు చేసినా, అవినీతికి పాల్పడినా వారిపై చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ముఖ్యమంత్రులు ఉంటున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు బలంగా ఉన్నట్టు కనిపిస్తున్నా, ఎమ్మెల్యేలను కట్టడి చేయలేని స్థితిలోనే ఉన్నారు. ఫలితంగా శాసనసభ్యులలో పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది శాసనసభ్యులు అధికారులపై దురుసుగా

ప్రవర్తించినా ఏమీ చేయలేని స్థితి! రెండు రాష్ట్రాలలో అవకాశం ఉన్నవారందరూ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. అధికారుల నియామకాలు, బదిలీలలో శాసనసభ్యుల సిఫారసే ఫైనల్‌గా ఉంటోంది. నిజానికి ఈ రెండు రాష్ట్రాలలోనూ ముఖ్యమంత్రుల పరపతి కారణంగానే అధికారంలోకి వచ్చారు. తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి తరపున ఎన్నికైన శాసనసభ్యులలో అత్యధికులు కొత్తవారే! అయినా వారిలో అంతులేని ఆశలు. దీనికి ప్రధాన కారణం రాజకీయాలకు నిర్వచనం మారిపోవడమే! రాజకీయాలలో చలామణి కావాలంటే డబ్బు కావాలి. దీంతో డబ్బున్నవారిని ఎంచుకుని పార్టీ టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి. సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని ఎన్నికలలో గెలిచినవారు తిరిగి అంతకు అంత సంపాదించే పనిలో ఉంటున్నారు. ఇదివరకు మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనవారు మంత్రిపదవిని ఆశించేవారు కాదు. ఇప్పుడలా కాదు! అందరికీ మంత్రిపదవులపై ఆశ పట్టుకుంది. మంత్రిపదవి లభించనివారు అలకబూనడం, వారిని సముదాయించడానికి ఇంకేదో లాభదాయకమైన మార్గం చూపడం ముఖ్యమంత్రుల బాధ్యతగా మారింది. దీనికితోడు ప్రతిపక్షాలను బలహీనపరిచే క్రమంలో ముఖ్యమంత్రులు ఫిరాయింపులను ప్రోత్సహించడం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఏ పార్టీవారన్నది చూడకుండా గెలిచే అవకాశం ఉన్నవారికి టికెట్లు ఇస్తున్నారు. ఇలాంటివారికి పార్టీల పట్ల విధేయత ఎందుకు ఉంటుంది? ఫలితంగా రెండు రాష్ట్రాలలోనూ అధికార పార్టీలలో క్రమశిక్షణారాహిత్యం పెచ్చరిల్లుతోంది. తెలంగాణలో వివిధ ప్రాంతాలలో మునిసిపల్ చైర్మన్లకు, శాసనసభ్యులకు పడటం లేదు. అదేవిధంగా రానున్న ఎన్నికలలో పార్టీ టికెట్ల కోసం పోటీపడుతున్నవారు ప్రత్యర్థులపై మాటల యుద్ధం మొదలుపెట్టారు. చండశాసనుడిగా పేరొందిన ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ పరిస్థితిని కట్టడి చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీలో ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సహజంగానే మెతక వైఖరి ప్రదర్శిస్తుంటారు కనుక క్రమశిక్షణను ఉల్లంఘించేవారిని సముదాయించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఎవరికీ భయం, భక్తి లేకుండా పోతున్నాయి. దీనికితోడు వివిధ నియోజకవర్గాలలో పార్టీ టికెట్లు ఆశిస్తున్నవారు కుమ్ములాటలకు పాల్పడుతున్నారు. మీ పార్టీ కాకపోతే అవతలి పార్టీ ఉంది కదా అన్న ధీమాతో ఎవరికివారు తల ఎగరేస్తూ ఉన్నారు. నానాటికీ పరిస్థితులు దిగజారడం వల్ల ముఖ్యమంత్రులు నిందలు భరించవలసి వస్తోంది. శాసనసభ్యులు, ఇతర నాయకులు చేసే పాపాలను పార్టీ అధినేతలు మోయాల్సి వస్తోంది. ఇటు కేసీఆర్, అటు చంద్రబాబు పరిస్థితిని గమనిస్తున్న కొందరు అధికారులు 'పాపం ముఖ్యమంత్రులు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవి 'థ్యాంక్‌లెస్ జాబ్'గా మారిందని ఒక సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఎన్నికలలో పార్టీ టికెట్ ఇచ్చి, ఆర్థికంగా ఆదుకుని, ఎమ్మెల్యేగా గెలిపించుకున్నా అధికారంలోకి రాకపోతే వారు పార్టీ ఫిరాయించరన్న గ్యారంటీ లేదు. అధికారంలో ఉన్నవారు తమ స్థానాన్ని సుస్థిరం చేసుకునే క్రమంలో ఫిరాయింపులను ప్రోత్సహించడం వల్ల ప్రతిపక్షాలు బతికి బట్టకట్టలేని పరిస్థితి. ఇదో విషవలయంగా మారింది. పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లను, విధేయులను కాదని ఎన్నికల సందర్భంగా అటూ-ఇటూ దూకేవారికి పార్టీ టికెట్లు ఇవ్వడం, ఇవ్వాల్సిన పరిస్థితి రావడంతో ఈ దుస్థితి ఏర్పడుతోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న నాయకులు ఏ పార్టీలో చేరాలన్నది వెంటనే నిర్ణయించుకోకుండా ప్రజల మొగ్గు ఎటుందో తెలుసుకుని ఆ పార్టీ వైపు దూకుతున్నారు. ఇలాంటి వారి నుంచి విధేయత ఆశించడం అత్యాశే అవుతుంది. అధినేతల నుంచి కిందిస్థాయి వరకు ఎవరి స్వార్థం వారు చూసుకుంటున్నారు. ఈ దుస్థితి పోవాలంటే ముఖ్యమంత్రి పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఒక్కటే పరిష్కారంగా కనిపిస్తోంది. ఈ విధానం వల్ల పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడే స్థానంలో కొత్తవారిని నియమించుకునే వెసులుబాటు ఉంటుంది. దీనివల్ల ఎమ్మెల్యేలను సముదాయించాల్సిన పని ఉండదు. ఫిరాయింపులకు ఆస్కారం ఉండదు. ఈ ప్రతిపాదన ఎప్పటినుంచో ఉన్నప్పటికీ ఎందుకోగానీ ఆచరణలోకి రావడం లేదు. ఇప్పటికైనా దీనిపై జాతీయస్థాయిలో చర్చ జరగడం వాంఛనీయం.

(ఆంధ్రజ్యోతి 'కొత్తపలుకు' నుంచి)

# ఉద్యోగాలనిచ్చే చిన్న పరిశ్రమలకు పెద్దపీట వేయాలి.. 2018-19 దార్శనిక పత్రంలో నాబార్డు

లక్షలమందికి ఉద్యోగాలు కల్పించే చిన్నపరిశ్రమలకు రుణాలివ్వటానికి పెద్దపీట వేయాలని నాబార్డు (జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు) సూచించింది. చిన్న పరిశ్రమలను ప్రోత్సహించటం ద్వారానే అత్యధిక ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 2018-19 రాష్ట్ర దార్శనిక పత్రాన్ని నాబార్డు రూపొందించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మూలధన పెంపు అవసరాన్ని గుర్తుచేస్తూ గతేడాది కంటే 15శాతం అధికంగా రుణాలివ్వాలని సూచించింది. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యమిస్తూ రూ. 1.65 లక్షల కోట్ల అంచనాలతో లక్ష్యాలను నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో రుణ వరవతి పెరిగితేనే అభివృద్ధి సాకారమవుతుందని స్పష్టంచేసింది. 2022కల్లా వ్యవసాయంలో రెట్టింపు ఆదాయం సాధించాలంటే కచ్చితమైన ప్రణాళికతో ముందుకెళ్లాలంది. రంగాలవారీగా అభివృద్ధి అవకాశాలు, రుణమంజూరు వివరాలను పత్రంలో వివరించింది.

### పంట రుణాలకు రూ.76,207.68 కోట్లు

జాతీయ నమూనా సర్వే ప్రకారం రైతుల్లో 59శాతం మందికి ఆర్థిక సహకారం అందడం లేదు. అంతరాన్ని నివారించేందుకు రాష్ట్రంలో సాగు విస్తీర్ణాన్ని లెక్కలోకి తీసుకుని పంట రుణాల మంజూరు పరిమితిని పెంచారు. 2017-18లో రూ. 63,105 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా.. 2018-19లో రూ. 76,207.68 కోట్లు కేటాయింపులు చేశారు. గతేడాదితో పోలిస్తే రూ. 13,102 కోట్లు పెంచారు. ఇందులో కౌలురైతులకు 10శాతం చొప్పున ఇస్తే రూ. 7,620 కోట్ల వరకు అందుతుంది.

### వ్యవసాయ అనుబంధంలో గిడ్డంగులు, ఉద్యానం..

వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ రుణమంజూరు పెరగాల్సి ఉంది. 2018-19లో దీనికి రూ. 30,108.69 కోట్లు కేటాయించారు. గిడ్డంగుల నిర్మాణానికి పెద్దపీట వేయాలి. ఉద్యాన, పట్టు శాఖలలో పండ్లు, కూరగాయలు, పూలసాగు, తదితరాలతోపాటు చిన్ననీటివనరుల పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, భూఅభివృద్ధి, పాల ఉత్పత్తి, కోళ్ల పరిశ్రమ, మత్స్యరంగాలకు నిధులు సమకూర్చాలి.

రిజర్వుబ్యాంకు సవరించిన మార్గదర్శకాల ప్రకారం మూలధనం, పెట్టుబడుల కింద రూ. 29,094 కోట్ల మేర ఆర్థికపరమైన ఊతమందించాల్సి ఉంటుంది. అన్ని అవకాశాలనూ వినియోగించుకుని చిన్న పరిశ్రమలకు తోడ్పాటునివ్వాలి.

### ఎగుమతులకు అవకాశాలు

వ్యవసాయ ఎగుమతుల జోన్‌గా చిత్తూరు, కృష్ణా, గుంటూరు జిల్లాలను ఎపెడా గుర్తించింది. సముద్ర ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలు, ప్లాస్టిక్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజినీరింగ్, ఖనిజాలు తదితరాల పరంగా ఆంధ్రప్రదేశ్ నుంచి భారీ ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే స్టాంపుడ్యూటీ మినహాయింపు, భూకేటాయింపులు, సరకు నాణ్యత విధానాల కింద రాయితీలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి రూ. 5,695.73 కోట్లు అవసరమవుతాయి.

### విద్యకు ప్రోత్సాహం

ఐఐఎం, ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ ఐటీ, నిట్, కేంద్రీయ విశ్వవిద్యాలయం, పెట్రోలియం యూనివర్సిటీ, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటుతో ఉన్నత విద్యారంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. దీనికి రూ. 3,545 కోట్ల మేర సహకారం అందించాలి.

### నిర్మాణానికి ఆర్థిక మద్దతు

గృహనిర్మాణ విధానం-2015లో భాగంగా మెరుగైన సౌకర్యాలతో ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాజధాని అభివృద్ధి, గృహనిర్మాణ రంగం కీలకం కానున్నాయి. ఇందులో రూ. 11,091 కోట్ల ఆర్థిక మద్దతు కల్పించాలి.

### మెగావాట్ నుంచి గిగావాట్

మెగావాట్ నుంచి గిగావాట్ వైపు అడుగులే లక్ష్యంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల పెంపుపై దృష్టి పెట్టాలి. ఇంధన భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన దిశగా చర్యలు

చేపట్టాలి. ఇందులో రూ.1139 కోట్ల మద్దతు అవసరం.

**మౌలిక సౌకర్యాలకు మరింతగా..**

ఆస్పత్రులు, తాగునీటి ప్లాంట్లు, ప్రైవేటు విద్యాసంస్థల అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. ఇందుకు రూ.720 కోట్ల ఆర్థిక సహకారం అందించాలి.

కాగా, రూ.1,94,220 కోట్లతో రూపొందించిన ఏపీ 2018-19 వార్షిక రుణ ప్రణాళికను ఇటీవల రాష్ట్ర బ్యాంకర్ల సమితి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఇందులో పంటరుణాల్ని గతేడాది లక్ష్యం కంటే రూ.12,000 కోట్లు పెంచారు. పారిశ్రామిక రంగానికి రూ.3,261 కోట్లు అదనంగా కేటాయించారు. కౌలురైతులకు రూ.7,500 కోట్లు రుణాలివ్వాలని నిర్ణయించారు. విద్య, గృహనిర్మాణం, మౌలిక సౌకర్యాలు, పునరుత్పాదక ఇంధన వనరులకు ఎలాంటి పెంపుదల లేదు.

# రూ.1.37 లక్షల కోట్లతో తెలంగాణ రుణ ప్రణాళిక

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1.37 లక్షల కోట్లతో తెలంగాణ బ్యాంకర్ల రుణ ప్రణాళిక ఖరారైంది. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో దీన్ని ఆమోదించి విడుదల చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.58,000 కోట్లు కేటాయించారు. మొత్తం రుణ ప్రణాళికలో ఇది 42.47 శాతం. పంట రుణాలకు రూ.42,494.26 కోట్లు (31.08 శాతం) కేటాయించారు. నేరుగా ఇచ్చే వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలకు రూ.7,744 కోట్లు కేటాయింపు చేశారు. అనుబంధ రంగాలకు రూ.3,678 కోట్లు దీర్ఘకాలిక రుణాలకు ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయ గోదాములు, ఇతరత్రా మౌలిక వసతుల కోసం రూ.2,103 కోట్లు, సహకార అనుబంధ రంగాలకు రూ.2,045 కోట్లు కేటాయించారు. వ్యవసాయ అనుబంధ రంగాలన్నింటిలో కలిపి 57.34 లక్షల యూనిట్లకు రుణ సహాయం అందించేలా ప్రణాళిక చేశారు.

సూక్ష్మ పరిశ్రమల విభాగంలో 3,48,219 యూనిట్లకు రూ.5,837 కోట్లు, చిన్న తరహా పరిశ్రమల విభాగంలో 1,86,009 యూనిట్లకు రూ.6,598 కోట్లు, మధ్యతరహా పరిశ్రమలకు 1,41,477 యూనిట్లకు రూ.8,946 కోట్లు కేటాయించారు. మొత్తం రుణాల్లో 15.64 శాతం ఈ రంగాలకు కేటాయించారు. విద్యారంగానికి రూ.1798 కోట్లు (1.32 శాతం), గృహ రుణాలకు రూ.6,011 కోట్లు (4.40 శాతం), ఇతర ప్రాధాన్య రంగాలకు రూ.5,493 కోట్లు (4.02 శాతం) కేటాయించారు.

**2018-19 తెలంగాణ వార్షిక రుణ ప్రణాళిక లబ్ధిదారులు**

| రంగం | లబ్ధిదారుల సంఖ్య |
|---|---|
| పంట రుణాలు | 47,65,684 |
| వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలు | 9,68,080 |
| సూక్ష్మ చిన్న పరిశ్రమలు | 6,75,705 |
| విద్యారుణాలు | 72,090 |
| ఇంటి రుణాలు | 75,113 |
| ఇతర ప్రాధాన్య రంగాలు | 2,34,102 |
| సాధారణ రంగాలు | 2,32,247 |
| మొత్తం | 70,23,020 |

**కౌలు రైతులకు పూచీకత్తులేని రుణాలు**

రాష్ట్రంలోని కౌలు రైతులకు పూచీకత్తు లేని రుణాలు ఇవ్వడానికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కౌలు రైతులతో సంయుక్త బాధ్యత సంఘాలు (జేఎల్‌జీలు) ఏర్పాటు చేసి వాటి ద్వారా ఈ రుణాలు అందించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని నాబార్డు కార్యాలయంలో ఎస్‌బీఐ, నాబార్డు, ఏడు స్వచ్ఛంద సంస్థలు త్రైపాక్షిక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 2000 జేఎల్‌జీలు ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వనున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించారు. జేఎల్‌జీ గ్రూపుల ఏర్పాటులో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కానున్నాయి.

# మళ్లీ మళ్లీ అర్జీలు.. ప్రజలంటే లెక్కలేని అధికారులు, పాలకులు

ఆంధ్రప్రదేశ్‌లో అంతా బాగుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ తెలుగుదేశం శ్రేణులను, ద్వితీయ స్థాయి నాయకులను, జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అధికార పార్టీకి చెమటలు పట్టిస్తోందని విశ్లేషణలు చెబుతున్నాయి. పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యంగా అధికారుల పట్ల.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందంటున్నారు.

రాష్ట్రంలో అధికారుల అవినీతి, నిర్లక్ష్యం ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. వీటికితోడు ముఖ్యమంత్రి నవనిర్మాణదీక్ష, ఆ వారోత్సవాలు, ఈ సభలు అంటూ అధికారులను అటూఇటూ తిప్పుతుండటంతో కార్యాలయాల్లో పనులు జరగటం కష్టమవుతోంది. డబ్బులు, పలుకుబడి ఉంటేనే అనుకున్న సమయానికి అనుకున్నట్టు పనులు జరుగుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుని ఉందో చంద్రబాబుకీ తెలుసు. గ్రామాల్లో రాజ్యాంగవిరుద్ధంగా తాను ఏర్పాటు చేసిన 'జన్మభూమి కమిటీలు' ఎంత అరాచకశక్తుల్లా వ్యవహరిస్తున్నాయో ఆయనకు పూర్తి సమాచారం ఉంది. అయినా.. 'ఎవరైనా వేధిస్తే పట్టించుకోవద్దు, నన్ను చూసి ఓటు వేయండి' అని విజ్ఞప్తులు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల సంవత్సరంలో ఏదోకరకంగా ప్రజల్లో ఉంటూ ఏదో చేస్తున్నట్టు కనిపించటం ముఖ్యం అంటూ.. దీక్షలని, సభలని రకరకాల కార్యక్రమాలతో పాలనా యంత్రాంగాన్ని పర్యటనలు చేయిస్తున్నారు. ఒకరకంగా అధికారుల్ని తన పార్టీ కార్యకర్తల్లా, పార్టీ కార్యకర్తలను అధికారుల్లా ఉపయోగించుకుంటూ రాజ్యాంగంతో సంబంధం లేకుండా ఈవెంట్ మేనేజ్‌మెంట్ పాలనతో లబ్ధి పొందాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. దీన్ని ఎంత ముమ్మరం చేయగలిగితే అంత లాభం ఉంటుందని ఆయన భావిస్తున్నారు.

పాలనాయంత్రాంగం పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో పలు కలెక్టరేట్లలో ఫిర్యాదుల తీరును చూస్తే అర్థమవుతుంది. ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ వచ్చిందంటే.. ఎక్కడో పాలనా వైఫల్యమున్నట్టు ఇంగితజ్ఞానమున్న ఎవరికైనా అర్థమవుతుంది. కానీ మళ్లీ మళ్లీ అర్జీలు వస్తున్నా కలెక్టరేట్ 'ప్రజావాణి'లో పట్టించుకోవటం లేదు. ఫిర్యాదులో వాస్తవం లేదనుకుంటే.. వెంటనే ఆ విషయాన్ని తేల్చి చెప్పాలిగా?.. అది కూడా లేదు. మొక్కుబడి ప్రహసనానికి 'ప్రజావాణి' ఒక ప్రతిబింబంలా తయారైంది. ఇటీవల దీనిని 'మీకోసం' అని పేరు మార్చారు. అయినా ఫలితం సున్నా.. పాత పద్ధతులే, పాత వైఫల్యాలే వెక్కిరిస్తున్నాయి. 'మీకోసం' అర్జీలు పెట్టుకున్నదారులను



కదిలిస్తే కన్నీటి కథలే వినిపిస్తున్నాయని మీడియాలో వస్తున్న పలు కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇంటి స్థలం కోసం ఒక స్వాతంత్ర్య సమరయోధుడు 18 ఏళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేదు. ఆయన పోయాక, ఆయన భార్య 86 ఏళ్ల వయసులో మళ్లీ అర్జీ పట్టుకుని తిరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. సంక్షేమ కార్డులు, కబ్జాలు, దౌర్జన్యాలు, పరిహారాలు, వైద్యం, స్వయంఉపాధి రుణాలు.. ఇంకా చాలావరకు స్థానికంగా, వెంటనే పరిష్కారం కావాల్సిన అంశాలపైనే ఎక్కువగా కలెక్టరేట్‌దాకా వస్తున్నారు. పరిష్కార వేదిక 1100ను ఆశ్రయిస్తే.. మీ సమస్య పరిష్కారమైపోయింది అని సమాధానం వచ్చినా, క్షేత్రస్థాయిలో సమస్య అలాగే కొనసాగుతోందని అర్జీదారులు వాపోతున్నారు.

కుడి చేయి ఏం చేస్తోందో ఎడమ చేయికి తెలియకపోవడం, ఈ అపారదర్శకతను ఆసరాగా తీసుకుని జనాన్ని దోచేయటం పాలనగా సాగుతోంది. విజయనగరం పట్టణంలోని రైతుబజారును కూల్చేయకుండానే రోడ్డును నిర్మిస్తామని, రైతులకు, వినియోగదారులకు అన్యాయం జరగనివ్వబోమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీకి కలెక్టర్ హామీ ఇచ్చిన కొన్ని రోజుల్లోనే దాన్ని కూలగొట్టేశారు. అదేమంటే.. సమాధానం చెప్పకుండా అందరూ తప్పించుకుంటారు. పాలన కొనసాగుతుంటుంది, కుర్చీల్లో అధికారులు ఉంటారు, వారికి జీతభత్యాలు ఠంచనుగా వచ్చేస్తుంటాయి.. కానీ వైఫల్యాలకు మాత్రం ఎవరూ బాధ్యత తీసుకోరు! తమకు జీతాలిస్తూ తమ ఖర్చుల్ని భరించేందుకు పన్నులు కడుతున్నది ప్రజలని, వారికి తాము సేవకుల్లా జవాబుదారీగా ఉండాలని అధికారులు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు తెలుసుకునేలా చేసేందుకు పౌర సేవల చట్టం, స్థానిక స్వయంపాలన వంటి సంస్కరణల కోసం అవగాహనతో పోరాడటమే పరిష్కారం. ✍

# కాలేజీకి రోడ్డు వేయండి బాబూ.. అని కూడా ఆందోళన చేయాల్సిన దౌర్భాగ్యమా!

ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించటం, ఉపాధిని అందించటంలో కీలకమైన మౌలిక వసతుల్ని కల్పించటం ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యతలని, కానీ ఆ రెంటి కోసం కూడా ఆందోళనలు చేయాల్సిన దౌర్భాగ్యస్థితి మన వద్ద నెలకొందని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు వెంకటరమణబాబు అన్నారు. పట్టణ సమీపంలోని శాంతినగర్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు రహదారి లేక విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల వద్ద దాదాపు గంట పాటు ఆందోళన నిర్వహించారు. విద్యార్థులంతా వచ్చి మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, కళాశాలను ఏర్పాటు చేసి ఆరేళ్లు గడిచిపోయినా నేటికీ విద్యార్థులు అవస్థలు పడకుండా వచ్చి చదువుకునే పరిస్థితి లేదన్నారు. కాలేజీకి కనీసం ఆటో కూడా వచ్చే మార్గం లేదన్నారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డును ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేత ఎం.గోపి, విద్యార్థి నేతలు చిదానంద, భవిత్, నజీర్, మురళి తదితరులు పాల్గొన్నారు.




# తిలక్ పేరుకు సంతకాలతో మద్దతు తెలిపిన విజయనగరం

విజయనగరం ఎత్తుబ్రిడ్జిపై నిర్మించిన కొత్త వంతెనకు తొలితరం పార్లమెంటు సభ్యుడు దివంగత కందాళ సుబ్రహ్మణ్య తిలక్ పేరును పెట్టాలన్న లోక్‌సత్తా డిమాండ్‌కు పట్టణంలోని పలువురు సంతకాలతో మద్దతు తెలిపారు. పార్లమెంటేరియన్‌గా, రైల్వే బోర్డు సభ్యునిగా నిజాయతీగా సేవలందించి విజయనగరం కీర్తిని పెంచిన తిలక్‌ను రాబోయే తరాలు కూడా గుర్తుంచుకునేలా చేయటం మన బాధ్యతని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, నగర అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు అన్నారు. కొత్త వంతెనలోని లోపాల్ని సరిచేసి అధికారికంగా తిలక్ పేరుతో ప్రారంభించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు కాళ్ల శ్రీను, నాయుడు, నగర కార్యదర్శి తాట్రాజు రాజారావు, పోలుపర్తి అప్పారావు, పీఎల్ఎన్ రాజు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల విద్యలో ఇంటర్ మిళితం

ఇంటర్మీడియెట్ విద్యను త్వరలో పాఠశాల విద్యతో మిళితం చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇంటర్‌ను పాఠశాల చదువులో విలీనం చేయాలని, 12వ తరగతి వరకూ అందరికీ నాణ్యమైన విద్యను తల్లిదండ్రుల జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందించాలని లోక్‌సత్తా చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

# పార్కుల కబ్జాపై లోక్‌సత్తా ఆగ్రహం



పార్కులను రక్షించడంలో అధికారులు, నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంఛార్జి వంశీ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ స్థలాలను, పార్కులను కబ్జాదారుల నుంచి రక్షించాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పార్కుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, హైదరాబాద్‌లో పార్కులు కబ్జా అవుతున్నా అధికార గణం చోద్యం చూస్తోందని అన్నారు. బండెడు పుస్తకాలతో, బిజీబిజీ క్లాసుల షెడ్యూల్‌తో, హోంవర్కులతో అలసిపోతున్న సిటీ పిల్లలకు, కెరీర్ వత్తిడితో నలిగిపోతున్న పెద్దలకు సరైన భద్రతతో ఆహ్లాదకరంగా వారు సేదతీరేందుకు పార్కులు అందుబాటులో లేవని అన్నారు. సింగపూర్, అమెరికా జపం చేసే నాయకులకు అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండే పార్కుల విషయం మాత్రం గుర్తురావటం లేదన్నారు. పార్కుల వల్ల పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, మంచినీటి వ్యయం తగ్గడం, సామాజిక సంబంధాలు బలపడటం, నేరప్రవృత్తి తగ్గడం, మానసిక సమస్యలు అదుపులోకి రావడం వంటి ఎన్నో లాభాలున్నాయని అమెరికన్ ఫారెస్ట్ ఆర్గనైజేషన్ అధ్యయనంలో తేలిందన్నారు. స్థానికంగా వార్డు ప్రభుత్వాలకు, మేయర్‌కు అధికారాలనిచ్చి పార్కులను పెంపొందించాలని, కబ్జాల్లో ఉన్న పార్కులను విడిపించాలని, ఖాళీ స్థలాలకు, పార్కులకు ప్రహరీ గోడల్ని నిర్మించాలని, రియల్ ఎస్టేట్ వెంచర్లలో విధిగా పార్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని వంశీప్రసాద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా కార్యకర్తలు, కూకట్‌పల్లిలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# 'పౌర సేవల' చట్టంతో మెరుగైన పాలనకు గ్యారంటీ



హక్కుగా 'పౌర సేవల' (రైట్ టు సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అమలు చేస్తే దేశంలో పాలన గణనీయంగా మెరుగుపడుతుందని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.జనార్థన రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ చట్టం అమలుకు కృషి చేస్తోందన్నారు.

"ఒక ఫైలు ఆలస్యమైతే.. సంబంధిత ఉద్యోగిని అందుకు బాధ్యుడిని చేయాలి. పౌర సేవల చట్టం ఆ పని చేయ గలుగుతుంది. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు మెరుగుపడతాయి" అన్నారు.

ప్రజలకు సర్కారీ ఆఫీసుల్లో అందించాల్సిన ప్రతి సేవకూ నిర్ణీత గడువు పెట్టటం, ఆలోగా అందించలేకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం దరఖాస్తుదారునికి చెల్లించే ఏర్పాటు చేయటం, తదితర నిబంధనలతో లోక్‌సత్తా రూపొందించిన సర్వీస్ గ్యారంటీ బిల్లు పార్లమెంటు వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే బిల్లును కొన్ని మార్పులతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు కూడా జేపీ పంపారు. సిటిజన్ ఛార్టర్లపై ప్రజలను చైతన్య పరిచేందుకు పౌర సేవల పత్రాలతో 1998లో లోక్‌సత్తా ప్రచురించిన 'స్వరాజ్యం' పుస్తకం ఇప్పటికి రెండున్నర లక్షలకు పైగా కాపీలు అమ్ముడయింది.

# మన విద్యార్థులు అమెరికా వాళ్లకంటే మెరికలు



మన పిల్లలు మేధస్సులో అమెరికా విద్యార్థులకంటే మెరికలని, పేదరికం, ఇతర సమస్యల్ని ఎదుర్కొంటూ కూడా విదేశీ విద్యార్థులతో పోటీపడి ప్రపంచస్థాయిలో రాణించగలుగు తున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ప్రతిభ ఎవరి సొత్తూ కాదని, దాన్ని వెలికితీసి సక్రమంగా వినియోగించుకున్నవారే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. తాను కూడా పేద కుటుంబం నుంచే వచ్చానన్నారు. మన పాఠశాల విద్యాప్రమాణాలు సరిగా ఉంటే.. వివక్ష లేకుండా దేశంలోని ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు లభిస్తాయన్నారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థులకుందన్నారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రం, మండలంలోని కంటేయపాలెం, హరిపిరాలల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 100 స్మైల్స్ చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ హంట్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌లు, పుస్తకశాలల్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, ఏ స్కూలులో చదువుతున్నామన్నది ముఖ్యంకాదని, ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యమని అన్నారు. బుద్ధి వికాసం కోసం విద్యార్థులు డిజిటల్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు పాఠశాలల్లో మౌలిక వసతుల్ని కల్పించటం అభినందనీయ మన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.70,000 ఖర్చు చేస్తోందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, చిన్నతనం నుంచే సమాజం పట్ల అవగాహన పెంచుకుంటూ ఉండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో కృషి చేయాలన్నారు. కుల, మత, వర్గ విభేదాలను పక్కనపెట్టి చదువు మీద దృష్టి పెట్టాలన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల్ని తమ పిల్లల్లా భావించి నాణ్యమైన విద్యాబోధన చేయాలని జేపీ సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో సృజనాత్మకత పెరిగేలా బోధన ఉండాలన్నారు.

సర్పంచ్ దారవత్ రాజేష్ నాయక్, ఎంపీపీ కర్నె సోమయ్య, మార్కెట్ ఛైర్మన్ అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో బాబు, ఎంఈవో బుచ్చయ్య, డీఎస్పీ రాజారత్నం, కృష్ణారెడ్డి, డాక్టర్ సట్ల వెంకట్, స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య, శ్రీనివాస్, బిచ్చానాయక్, పల్లె యాకయ్య, కొమురయ్య, 100 స్మైల్స్ ప్రతినిధులు చిట్టిమళ్ల మనోజ్‌కుమార్, స్వప్న, కల్పన, గ్లోబల్‌హంట్ ప్రతినిధి మేఘన, లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, పీపుల్ అగనెస్ట్ కరప్షన్, విలేజ్ లైబ్రరీ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# బాధితులుగా ఉన్న సామాన్యులపై కేసులా? : జేపీ ఆగ్రహం

# ... లంచగొండులను పట్టించిన పౌరులకు అశ్వరథ సన్మానం

గత్యంతరం లేక లంచం ఇస్తూ బాధితులుగా ఉన్న సామాన్య ప్రజల్ని కూడా జైల్లో పెట్టేలా తయారుచేసిన బిల్లుని పార్లమెంటులో ఆమోదించటాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా గర్హించారు. ప్రజలకు సరిగా సేవలందించేలా ప్రభుత్వోద్యోగుల చేత పనిచేయించటం చేతగాకే పాలకులు ఇలాంటి అసంబద్ధ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. సంఘటితంగా ఉండే ఉద్యోగులంటే ఉన్న భయంతో అసంఘటితంగా ఉన్న కోట్లాది ప్రజలను అవమానిస్తున్నారన్నారు. ఒక సర్టిఫికెట్ కోసమో, హక్కుగా అందాల్సిన మరో సేవ కోసమో గతిలేక లంచం ఇచ్చే ప్రజల మీద కేసులు పెట్టటం మొదలుపెడితే దేశంలోని జైళ్లు సరిపోవన్నారు. ఈ విషయాలన్నిటినీ వివరిస్తూ పార్లమెంటు సభ్యులందరికీ, అన్ని పార్టీల నేతలకూ లేఖలు రాశానని, స్వయంగా న్యాయశాఖా మంత్రిని కలిసి వివరించానని... అయినా పార్టీలు నోరు మెదపకుండా బిల్లుకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ ఇలాంటి చట్టాన్ని తేడన్నారు. ఇలాంటి మతి లేని చట్టాలను తేవటం మీద విన్యాసాలు చేయకుండా... ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ గడువు పెట్టి ఆలోగా హక్కుగా పని జరగకపోతే పరిహారం చెల్లించేలా 'పౌరసేవల' చట్టాన్ని తేవాలన్నారు.

అవినీతిపరులైన అధికారులను ఏసీబీకి పట్టించిన ముగ్గురు పౌరయోధులు... శ్రీనివాస్ యాదవ్, జడల వెంకటేశ్వర్లు, పాలిక రఘునాచారిలను సన్మానించేందుకు 'జ్వాల' సంస్థ వరంగల్ జిల్లా హన్మకొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. అశ్వరథంపై, టాప్‌లెస్ కారుపై అంబేద్కర్ విగ్రహం వరకు ఊరేగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాధితులుగా ఉన్నా సరే అవినీతిపై పోరాడిన ఆ పౌరయోధులకు రూ.15,000 చొప్పున పురస్కారం చెక్కుల్ని అందించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రోజురోజుకూ పెరిగిపోతోందని జేపీ అన్నారు. అయితే, దేశంలోని సుమారు 40 కోట్ల కుటుంబాలలో 25 కోట్ల కుటుంబాలు విధి లేక లంచాలిస్తున్నాయి తప్ప ఏదో చట్టవిరుద్ధ ప్రయోజనం కోసం లాలూచీ పడి కాదన్నారు. ప్రజలు అవినీతి బారిన పడకుండా సేవలందించటం, లాలూచీ కోసం లంచం ఇచ్చేవారిని మాత్రం కఠినంగా శిక్షించటం, నిజాయతీగల ప్రభుత్వోద్యోగులకు తప్పుడు ఆరోపణల నుంచి రక్షణ కల్పించటం వంటి ఏర్పాట్లతో అవినీతి నిరోధక వ్యవస్థను నిర్మించాల్సిందిపోయి... బాధితులుగా ఉన్న సామాన్యుల మీదే కేసులు బనాయించే చట్టం చేయటం తీవ్ర విపరిణామాలకు దారితీస్తుందన్నారు. అవినీతి నిరోధక చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణ వల్ల... హక్కుగా అందాల్సిన ఓ సర్టిఫికెట్ కోసం రూ.100 ఇచ్చినా మూడు నుంచి ఏడేళ్ల వరకూ శిక్ష పడుతుందని, లంచం తీసుకున్న అధికారి మీద విచారణ చేయటానికి కూడా అనుమతి కావాల్సి ఉంటుందని అన్నారు. అవినీతిపై పౌరసమాజం నైపుణ్యంతో ఉద్యమించాలని, అవినీతిని వెలికితీసేవారికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి అంతానికి పార్టీలకతీతంగా లోక్‌సత్తా పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. త్వరలో తెలంగాణలోనూ సురాజ్య యాత్రను చేపడతామన్నారు. కార్యక్రమంలో జ్వాల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుంకరి ప్రశాంత్, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి పర్సా కోదండరామారావు, ఎన్.శ్రీనివాస్, మీనేశ్వరరావు, తెలంగాణ జనసమితి యువజన విభాగం నేత తిరువరి శేషు, సహచట్టం జిల్లా కో కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రజనీకర్‌రెడ్డి, వాంకె నర్సింగరావు, బుద్దె పెద్దన్న, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

Posting Date 07-08-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on August 1st, 2018



# నా దృష్టిలో జేపీ అత్యంత విజయవంతమైన వ్యక్తి : జేడీ

"లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ గారు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేశారు. సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం ఏదైతే ఉందో, దానికోసం అద్భుతంగా పనిచేశారు. ప్రజాస్వామ్యంలో సమాచారం కీలకం, అది ప్రజలకు చేరటం ఎంతో అవసరం ! ఇలాంటి ఆలోచనలన్నీ జయప్రకాష్ నారాయణ్‌గారే ప్రజల్లోకి తీసుకొచ్చారు. మీరు అనుకుంటుంటారు - రాజకీయాల్లో ఆయనో ఓ వైఫల్యమని, కానీ నా దృష్టిలో జయప్రకాష్ నారాయణ్‌గారు అత్యంత విజయవంతమైన వ్యక్తి. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు !"

-సీబీఐ మాజీ జేడీ, ఐపీఎస్‌కి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి
సామాజిక కార్యకర్తగా మారిన వి.వి.లక్ష్మీనారాయణ ఓ మీడియా ఇంటర్వ్యూలో

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

**Lok Satta Times**
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad